# మిస్. రుద్రాక్షమాల

ఆ రోజున కాలేజీకి బయలుదేర బోతూంటే పత్రిక వచ్చింది. అలవాటు ప్రకారం వార ఫలితాలు చదవటం మొదలుపెట్టాను. "ఈ వారంలో మీరు ఎన్నడూ ఊహించనటువంటిది, మీ జీవిత పంథానే మార్చగల ఆకస్మిక సంఘటన ఒకటి జరుగుతుంది." గడియారం తొమ్మిది కొట్టింది. గదికి తాళంవేసి, కాలేజీకి బయలుదేరానన్న మాటేగాని, జ్యోతిష్కుడి మాటలే మనస్సులో మార్మోగుతున్నాయి.

జీవిత పంథానే మార్చగల ఆకస్మిక సంఘటన అంటే? కాలేజీలోంచి 'డిబారు' చేస్తారా? సరసమాడబోయిన ఏ చిన్నదాని తాలూకు పెద్దలన్నా సమయంచూసి దేహశుద్ధి చేస్తారా? లేకపోతే ఏ బాపతుదన్నా ముదనష్టం ఎస్టేటు ఒకటి మనపాల బడుతుందా? అని పరిపరి విధాల తర్కించుకుంటూ బస్సు స్టాపు చేరాను. అక్కడి వాతావరణంలో ఏ మార్పూ లేదు. రకరకాల బస్సుల కోసం జనం మామూలుగానే రకరకాల 'క్యూ'లలో బారులుతీర్చి నిలబడి వున్నారు. ఒక్కొక్క బస్సే రావటం, పట్టినంత మందిని ఎక్కించుకుని పోవడం, ఇది నిత్యం జరిగే కాండే. ఈనాడూ జరుగుతోంది. పదమూడు నెంబరు బస్సు 'క్యూ' లో ఏడెనిమిది మంది జనంకంటే ఎక్కువలేరు. బస్సు రావటానికి యింకా రవ్వంత వ్యవధి వుంది. చేసేదిలేక చూపులు అటూ యిటూ సారించి, దిక్కులు చూడటం మొదలుపెట్టాను. కుప్పుస్వామి స్ట్రీటులోంచి, ఎవరో కాషాయాంబరధారి యిటే వస్తున్నారు. ఎవరీ ఆడస్వాములవారు? పాదచారులై యిల్లా ఎక్కడికి దయచేస్తున్నారు? అని నాలో నేను ఒక్క క్షణం తర్కించుకుని సందేహాలతో, సమస్యలతో సతమతమవుతూ నిలబడగా, వారు చేరువకు వచ్చారు. వారిని చూసి మనస్సులోనే అంజలి ఘటియించాను. ఆ చామంతిరేకుల వన్నెల చిన్నది! ఆ అపురూప సౌందర్యరాశి, ఆ అపురూప అలేఖ్య తనూ విలాసిత! ఇహం పరం తనవి కాదని, సర్వస్వం త్యాగంచేసి, వాంఛలు విడనాడిన ఆశ్రమవాసిని కాదు. కాషాయరంగు జార్జెట్ చీరె, ప్లాస్టిక్ రుద్రాక్షమాల ధరించి, రెండు నల్లత్రాచులాంటి జడలు, రెండు కెంపు వన్నె గులాబీలతో దివ్యంగా వుండి, నిగనిగాల సొగసుతో పై పొంగి పొరలే వయసులో వున్న కాలేజీ కన్నె. ఆమెని అనుసరించి, పుస్తకాలు పట్టుకు వస్తున్న దాసి, దాస దాసీ జనాలతో విచ్చేసారు. రాచవారేమో? రాచవారి కన్నెలు కాలు క్రింద మోపరుగదా? ఎండకన్నెరుగని అసూర్యంపశ్యలు. చూపుకే కందిపోయే సుకుమారులు- యీ విధంగా కాలినడకను నడిచి, పామరజనం ఎక్కే

బస్సు కోసం రావటం అబ్బురంగా వుందే!! తమ ప్రజానీకం పడే పాట్లనూ కష్టసుఖాలను స్వయంగా విచారించి తెలుసుకోవడానికి యిల్లా దయచేశారేమో? అని నేను సతమతమవుతున్న క్షణంలో, ఆ అలికులవేణి, నా వెనుకకువచ్చి నిలబడేసరికి నాకు ఒక్కసారిగా దగ్గరలోనే వెయ్యి మెరుపులు మెరిసినట్టయి గులాబీల ఘుమఘుమలు, చిన్నదాని సోయగం నన్ను మత్తెక్కించి బస్సువచ్చిన సంగతే మరచేటట్టు చేసేసరికి,

బస్సు స్టాపులో నిలబడ్డ ట్రాన్సుపోర్టు ఇనస్పెక్టరు "ఏరుంగో! (ఎక్కండి) అని అనగానే నేను తెప్పరిల్లి, మనస్సు కూడచేసుకుని బస్సు ఎక్కాను. ఆ చిన్నదికూడా నా వెనుకనే బస్సు ఎక్కబోయింది. కండక్టరు నిర్దాక్షిణ్యంగా,

'ఎడమిల్లే' (స్థలంలేదు) అని అనేసరికి నేను బస్సులోంచి క్రిందకుదిగి, "యూ ప్లీజ్ గెట్ ఇన్. ఐ విల్ గో బై నెక్స్ట్ బస్" అని అన్నాను.

చిన్నది బస్సు ఎక్కి వెళ్ళిపోయింది. క్యూలో నా వెనక నిలబడ్డ కుర్రవాడు 'నల్లవాన్ వాలివన్' అంటూ తనలో తాను గొణుక్కున్నాడు. ఏమిటి వీడు వాలి నల్లగా వున్నాడని అంటున్నాడా? అని మనస్సులో ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్నకు సమాధానం అన్నట్టు ఎదురుగుండా గోడమీద 'నల్లవాన్ వాలివన్' అన్న సినిమా పోష్టరు కనిపించింది. రెండో బస్సు వచ్చింది. అదృష్టవశాత్తు అట్టేమంది జనం లేకపోవడంవల్ల కూర్చోవడానికి స్థలం దొరికింది. అదికూడా ఎక్కడ? మడికట్టుకుని గుళ్ళోకి వెళ్ళివస్తున్న అరవైఏళ్ళ అవ్వగారి ప్రక్కన. బుద్ధిమంతుడిలాగా కూర్చొని సుఖంగా ప్రయాణంచేసి, కాలేజీకి వెళ్ళాను.

క్లాసులో లెక్చరరు తన శాయశక్తులా తనకివచ్చే జీతానికి ఎన్నోరెట్లు ఎక్కువగానే పాఠం చెబుతున్నాడు. కాని మన మనస్సు అక్కడ వుంటేగా!

'ఎందు జూచిన గాని నీవేనే లైలా! అన్న పాట మనస్సులో గజిబిజిగా రొద చేస్తూంటే 'థియరీ ఆఫ్ రెలిటివిటీ' ఎవరికి కావాలి?

ఇంటికి వచ్చానన్న మాటేగాని అన్నం సహిస్తేనా? హోటలువాడి లోపమేమీ లేదు. రాత్రి ఒంటిమీద కునుకు పడితేనా? మనవాడు తెల్లవారి అద్దంలో ముఖం చూసుకుంటే, పెద్ద 'ఖాయలా' పడి పది లంకణాలు చేసినవాడిలాగా వుంది.

మళ్ళీ కాలేజీ టైము అయింది. బస్సు స్టాండు చేరారు. నిన్న కనబడ్డ రుద్రాక్షమాలా సుందరి, సఖీజన సమూహంతో అప్పటికే వచ్చి 'క్యూ'లో పదిహేను స్థానాలు ముందర నిలబడి వుంది. నన్ను చూసింది. చూడనట్టుగా నటించింది. చెలికత్తెలతో, కువ కువ మని పావురాయిలాగా ఏదో గుసగుస వార్త చెబుతోంది. అది విని వాళ్ళంతా ఒక్క క్షణం పరకాయించి చూశారు. మళ్ళీ వాళ్ళ కాన్వరెన్సు

తీసి అర్థం చూస్తే తనహయి అంటే, ఒంటరితనం ఏకాంతం, విరహం వగైరా అర్థాలు వున్నట్టుగా తెలిసింది. ఆ పిల్లది పాడిన ఒక చరణం ఆకళింపు చేసుకునేసరికి

విరహపు వేళలలో ఎన్నడైన

'ఈ చెలి తలపు నీమదిలో మసలేనా'

అని అర్థమైంది. నేను నిట్టూర్పు విడిచినాలో నేను అనుకుంటున్నట్టుగా

'ఇద్దర మెక్కింది ఒకటే పడవ చిన్నదానా!' అని అనుకొని హుటాహుటి బయలుదేరి ఆక్వేరియం హోటలకు (ప్రస్తుతం మెరినా కాంటీను) వెళ్లాను. బయట చలివేస్తున్నట్టు వున్నా ఐస్ కాఫీ ఆర్డరు యిచ్చి పావలాకాసు జ్యూక్ బాక్సులో పడేసపి. మీటనొక్కి వచ్చి కూర్చున్నాను. కూర్చున్న క్షణంలో అసలు లతామంగేష్కరు కంఠం.

'కహిదీప్ జలే ఔర్ దిల్‌కో' అంటూ పాడటం మొదలు పెట్టింది. పాట పూర్తి అవుతూ వుండగానే ఐస్ కాఫీ వచ్చింది. కాఫీ త్రాగుతూ వుండగా పాట పూర్తియైంది. వెంటనే మళ్ళీ ఆ పాటే ప్రారంభమైంది. ఎవరా ? అని తల ఎత్తి చూసే సరికి కనిపించింది ఎవరూ !

ఆడ స్వాములవారు !! ఎవరో సావాసగత్తెతో యిటే తరలి వస్తున్నారు. అంటే యింతసేపూ లోపలే వున్నారన్నమాట ! ఆ చిన్నది కంట పడగానే ఇంతకాలం వేధిస్తున్న నిరాశ, ఒంటరితనం యిట్టెదూరమైనా మనసులోని ఆశలు బంగారు అందలా లెక్కాయి. మనసులో హంసలు రెక్కలు నిప్పాయి.

నేను కూర్చున్న బల్లని సమీపించగానే, చిన్నదాని మనస్సు ఒక్క క్షణం ఏదో ఆలోచనలో పడ్డది. వెంటనే మందహాసంతో బాటు మనం కూడా జ్ఞాపకానికి వచ్చాము.

నేను కుర్చీలోంచి లేచి నిలబడి 'నమస్తే' అని అన్నాను.

ఒక్కక్షణం చిన్నది తెల్లబోయింది. మళ్లి అంతలోనే సంబాళించుకుని 'నమస్తే' అని ప్రతి నమస్కారం చేస్తూ తన సావాసగత్తెను నాకు చూపిస్తు

'మా ఫ్రెండు రాధ.'

వీరు మిష్టర్ రామం ప్రెసిడెన్సీలో పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తున్నారు. అంటూ నన్ను పరిచయం చేసింది.

నన్ను గురించి యింత యినఫర్‌మేషన్ ఎప్పుడు ఎల్లా సంపాదించిందా అని నేను ఆశ్చర్యపడిపోయాను.

కూర్చోండి అని వాళ్ళిద్దరిని ఆహ్వానించాను. వాళ్ళు కూర్చున్నారు. తన చెలికత్తె పేరు చెప్పింది. కాని తన పేరు చెప్పలేదు. ఏ పేరుతో పిలవటం అని సందిగ్ధంలో పడ్డాను. రాధ మెడికల్ కాలేజీలో చదువుతోందిట. కేరళ రాష్ట్రంలోని 'చంగానా చెర్రి వాళ్ళ స్వగ్రామమంట' అని రాధ స్నేహితురాలు చెప్పింది. స్నేహితురాళ్ళు యిద్దరూ నా బలవంతం ఆహ్వానం మీద యింకొక కప్పు కాఫీ త్రాగారు ఒక్కసారి కూడబలుక్కున్నట్లు తమ తమ గడియారాల వంక చూసుకున్నారు. ఆ సంకేతాన్ని గ్రహించిన నేను..

ఏదో పని మీద వున్నట్టున్నారు ? అని అడిగాను.

వాళ్ళు ఒక్కక్షణం తటపటాయించి సినిమాకి వెడుతున్నాం అని సమాధానమిచ్చారు.

ఇంగ్లీషు పిక్చరా !

కాదు అరవ పిక్చరు, నెంజిల్ ఓరు ఆలయం. చాలా గొప్ప పిక్చరు మీకేం పనిలేకపోతే మీరు కూడా రండి' అంటూ రాధమ్మ ఆహ్వానించింది.

నేను ఒక్కక్షణం తటపటాయించాను. నేను ఏమంటానో విందామని ఆడస్వాముల వారు తదేక ధ్యానంలో వున్నారు.

'మీకు యిబ్బందేమో' అని ఒక చిన్న డైలాగు వాడాను.

'యిబ్బందేముందండి ! తెలిసిన వాళ్ళమంతా కలిసి చూస్తే ఎటువంటి సినిమాఅయినా సరే చాలా బాగుంటుంది.

"O.K. Thank you Very much." అని నేను అన్నాను. ఇద్దరు అందమైన పిల్లలు వెంటరాగా హోటలు నుంచి బయటకు నడిచి వచ్చాను. ముగ్గురం టాక్సీ యెక్కాం. టాక్సీ కదిలే ముందర మనస్సులో ఒక ఆలోచన వచ్చింది.

'వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో రేపు కొబ్బరికాయ కొట్టాలి.' కారు కాసినో చేరింది. అదృష్టంకొద్దీ అట్టే యిబ్బంది లేకుండానే టికెట్లు దొరికాయి. మామూలు రోజులో అరవై ఏడు కాని నూటముప్పై మూడు పైసలకంటే, సినిమా కోసం ఎక్కువ ఖర్చుపెట్టని నేను తల ఒక్కింటికి రెండు రూపాయల అరవైరెండు నయాపైసలు ఖర్చు పెట్టడానికి చింతపడలేదు. సరికదా, ఆ సినిమాలో కూర్చున్నంతసేపూ స్వర్గమంటే యిదే ననిపించింది. సినిమా పూర్తై అంతా బయటకు వచ్చాం. నేనూ ఆడస్వాముల వారు మిగిలాం. నేను ధైర్యం చేసి,

'ఏమండీ మిమ్మల్ని ఒక్కమాట అడగనా'

'అడగండి'

'మీ పూర్తి పేరేమిటి ?'

'శ్యామల' అంటూ ఫక్కున నవ్వింది. ఆ నవ్వు వింటుంటే పర్వతం మీద నుంచి పరుగులు వేసుకుంటూ వచ్చే వాగు గుర్తుకువస్తే. ఆ నవ్వు చూస్తుంటె వెన్నెల రాత్రి మెరుపు మెరిసినట్టు అనిపించింది. ఆ మనిషి దగ్గరున్న వేళా విశేషమనుకుంటాను, ఒక్కొక్కసారి వెంటపడి పరుగెత్తుతేనే కాని మన మాట ఆలకించని టాక్సీవాడు ఈ నాడు ఎందుకనో, మా జంటని చూడగానే, వేగం తగ్గించి కారు పేవ్‌మెంటు దగ్గరకు రానిచ్చి

"టాక్సీసార్" అని అనేసరికి నేను ఏనుగెక్కినంత సంబరంతో 'రండి, మీ యింటి దగ్గర డ్రాపు చేస్తాను' అని అన్నాను.

'థాంక్యూ' అంటూ కారు నెక్కింది.

నేను డ్రైవరు ప్రక్కన ముందుసీటులో కూర్చున్నాను.

'సినిమా ఎల్లావుంది' అని తెలుగులో అడిగింది.

అన్ని విధాలా చాలా బాగుంది. కాని ఆ సీతని చూస్తుంటే

సీతని చూస్తుంటే...

స్త్రీ జాతి అంటే చాలా కోపం వచ్చింది.

ఎందుకని

సీతచేస్తున్న ప్రతి పనిలో ఆడిన ప్రతి మాటలో స్వార్థమే కనిపించింది...

అందులో స్వార్థం ఏముంది ?

తనని ప్రేమించిన వ్యక్తి సర్వనాశనమవుతూ వుంటే చూస్తూ వూరుకుంది. కాని ఏమాత్రం సహాయం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యలేదు.

'సీతని అంటారుగాని, మురళీ చేసిన పని మాత్రం ఏం బాగుంది ? ఒకప్పుడు వాళ్ళు యిద్దరూ ప్రేమించుకున్నారు. బాగానే వుంది. కాని ఆ ప్రేమ ఫలించలేదు. తన ప్రియురాలు యింకొక వ్యక్తి భార్యయైంది. ఆ పరిస్థితులలో పూర్వజన్మ స్మృతులు జ్ఞప్తికి తెచ్చి, బాధ పెట్టడం స్వార్థమా, మరీ మాట్లాడితే 'శాడిజమా' !!

'మనంత తాపీగా యీ సమస్యని గురించి ఆలోచించగల స్థితిలో మురళీ లేడు చూడండి శ్యామలా దేవిగారు'

శ్యామలాదేవిని కాను, శ్యామలనే.

'చూడండి శ్యామలగారు, అదృష్టవంతుడిని ప్రేమ ఆకాశాని కెత్తుతుంది. అదే ప్రేమ దురదృష్టవంతుడిని అధోపాతాళానికి అణగద్రొక్కుతుంది.

'నిజం ! నేనూ ఇదే అనుకున్నాను. మీరు కవులు కాబట్టి యింత బాగా చెప్పగలిగారు.'

కవినంటూ నన్ను ఎగతాళి చేస్తున్నారు.

ఎగతాళికాదు. మీరు కవి అని చెప్పడానికి మీ బస్సుస్టాపు పద్యం చాలు.

'థ్యాంక్యూ'

ఒక్క క్షణం ఆగి శ్యామల "మీ హాబీస్ ఏమిటి ?" అని అడిగింది.

'ఫొటోగ్రఫీ, కథలు రాయడం, క్రికెటు, టెన్నీసు.'

'ఇదేనా ? పరాయి ఆడపిల్లలని పలకరించడం కూడా మీ మెయిను హాబీ ఏమో ననుకున్నా.'

నన్ను ఎవరో కొరడాతో కొట్టినట్టునిపించింది.

'మీరు యిందాక హోటల్లో పలుకరించగాని ఏమనిపించిందో తెలుసా ?

ఏమనిపించింది ?'

మనుచరిత్రలో పద్యం గుర్తుకు వచ్చింది.

'ఏ పద్యం ?'

'ఇంతటి కన్నులుండ తెరువువ్వరి వేడెద భూసురేంద్ర !'

ఏకాంత మందున్న జనరాంద్ర నెపంబిడి....

'మిగతా పద్యం నాకు వచ్చు' అని నేను అర్థోక్తిగా అన్నాను. వాణీమహలు దాటి కారు ముందుకు సాగుతోంది.

'నేను ఇక్కడ దిగుతాను' అని శ్యామల అంది. కారు ఆగగానే, మేమిద్దరం దిగాం.

'నేను గుడ్‌నైట్' అని అన్నాను. తనుకూడా

'గుడనైట్' అని అంటూ వెళ్ళిపోయింది.

శ్యామల మీద నాకు అంతులేని కోపం వచ్చింది. ఇహ యీ మనిషితో ఎప్పుడూ మాట్లాడ కూడదు. అంటూ ఇంటికి తిరిగి వచ్చాను.

నా గదిలో లైటు వెలిగిందో లేదో కాని ప్రక్కయింటి వాళ్ళ అబ్బాయి. 'మామా' అంటూ పిలిచాడు.

'ఏం ?' అన్నట్టు వాడివంక చిరాకుగా చూచాను.

'అక్క ఇలస్ట్రేటెడు వీక్లీ అడిగి తీసుకు రమ్మన్నది' నేను ఒక్కసారి వాళ్ళ యింటివంక చూచాను. ఎర్ర బోర్డరు కాషాయిరంగు చీర కట్టుకుని, వాళ్ళ అక్కయ్య నా గది వేపు చూస్తోంది. మనిషి చాలా మంచిది. బుద్ధిమంతురాలు చూడటానికి కూడా అందంగానే ఉంటుంది. ఇందాక చెప్పానుగా లతామంగేష్కరులాగా

పాడుతుందని, ఇన్ని సుగుణాలున్నా హామ్లెట్టు చెప్పినట్టు ఒక్క రవ్వంత చిన్న దుర్గుణం ఒకటి వుంది, యీ సుగుణాలన్నీ కనిపించకుండా చేస్తోంది.

ఉర్దూలో విరహ గీతాలు పాడటం. ఇలస్ట్రేటెడు వీక్లీ రాగానే, క్రొత్తగా పెళ్ళైన వాళ్ళ ఫోటోలవంక చూస్తూ మళ్ళీ కొత్తప్రతిక వచ్చేదాకా యీ పత్రిక నాకు యివ్వకపోవటం, వాళ్ళ నాన్నేమో ఈ పిల్లదాని పరిస్థితి గ్రహించడు. మంచిరోజు చూసి ఆ మూడు ముళ్ళూ వేయించడు.

తల్లిపోరు పడలేక, ఒక చక్కటి సంబంధం చూసి తీసుకు వచ్చాడు. ఉభయులకు నచ్చింది. కట్నం విషయంలో కూడా ఎటువంటి పేచీ రాలేదు. పెళ్ళి తాంబూలాలు పుచ్చుకోవయ్యా మహానుభావా !" అని ఒకసారి కదిలిస్తే.

ఆయన పెదవి విరిచి 'అబ్బె ! ఆ సంబంధం సంక్షేపించుకున్నాం' అని అన్నాడు.

'ఎందుకని ?'

'వాళ్ళబుషులు మా బుషులు అన్నదమ్ములు' అని సమాధానం వచ్చింది.

బుషుల మధ్య చుట్టరికాలేమిటయా పిచ్చివాడా !' అన్నివిధాల మంచి సంబంధంచెయ్యి జారిపోనివ్వద్దు.' అని అందరూ చెవిని యిల్లు కట్టుకుని పోరినా, ఆయన ససేమిరా అని మొండికెత్తి

'అటువంటి కాని పనులు చెయ్యలేను' అని అన్నాడు.

ఆయన ధోరణికి ఆ చిన్నదాని మనస్సు కరుడు కట్టుకుని పోయింది. ఇప్పుడు పెళ్ళిళ్ళ ఫోటోలు చూడటం మానేసి, పసిపిల్లల ఆల్బం ఒకటి తయారు చేస్తోందని కర్ణా కర్ణీగా విన్నాను. ఆ చిన్న దానిని తలుచుకుంటే జాలి వేసింది. ఆమె తండ్రిని గురించి తలుచుకుంటే ఒళ్ళు మండే కోపం వచ్చింది. కోపం తగ్గేసరికి అంతులేని ఆకలివేసింది. కాలా తీతమైందే, యీ వేళ కాని వేళలో మనకి బువ్వపెట్టే పేదరాశి పెద్దమ్మ దొరుకుతారా అని ఆలోచించి, ఎలాగో అల్లా ఓపిక తెచ్చుకుని, రాఘవయ్య రోడ్డు చివరనున్న నాయరు కొట్టుకు వెళ్ళాను.

నాయరు పడక కుర్చీలో పడుకుని ఉన్నాడు నిద్దర మాత్రం పోవటం లేదు. కన్నార్పకుండా అనంతంలోకి చూస్తున్నాడు. వేళ కాని వేళలో యిలా అంతర్ముఖుడై దిగ్మండలానికి అవతల వున్నవాటిని చూస్తున్నాడేమిటని నేను ఒక్క క్షణం అతని వంక తీరికగా చూచేసరికి, జ్యోతుల్లాంటి కళ్ళ అడక్కుండానే కధంతా చెప్పాయి. నాయరు ఎక్కడో రహస్యంగా మద్యపాన నిషేదం మీద కసి తీర్చుకున్నాడు. ఈ మైకం, మహోదానందం ఆ బాపతువే.

'నాయర్' అని నేను పిలిచాను.

ఆ మహాత్ముడి చూపు నన్ను దూసుకుని పోయింది. ఆకలిబాధ భరించలేక,

పిలుపు రెట్టించాను. నావంక ఒక్కక్షణం చూసి, నాయరు కళ్ళు మూసుకున్నాడు. నేను ఉండబట్టలేక అరటిపండు ఒకటి గెలనుంచి తుంచాను. వెంటనే సమాధిభంగమైంది.

'మూడు రెండణాలు' అని అన్నాడు.

"పాలున్నయా"

ఇరవై నయాపైసలు

పాలు పళ్ళు పుచ్చుకొని గూటికి చేరేసరికి పదకొండు దాటింది. ప్రక్కమీద పడుకొన్నాన్నమాటే గాని నిద్దుర పడితేనా...

శ్యామల అన్నమాటలు కొరడా దెబ్బలాగా చెళ్లున మనస్సుకి తగులుతున్నాయి.

'పరాయి ఆడపిల్లలని పలుకరించడం మీ మెయిను హాబీయేమో'నేను అంత దూర్మర్గుడినా ? ఋష్యశృంగుడి లాంటివాడినని, లెక్చరర్లంతా పొగిడింది నన్ను కాదా ! ఆడపిల్లలని వేటాడమేనా నాపని ? నా జీవిత లక్ష్యం ! శ్యామల నన్ను ఎంత తప్పుగా అర్ధం చేసుకుంది. ఎటువంటి నీచుడిగా భావించింది.

ఆ సుందరమూర్తిని చూసి, నన్ను నేను మరిచానే ఆరాధ్యదేవతగా భావించి హృదయ సింహాసనం మీదను అధిష్టించి పూజించుదామని ఆశించానుగాని, యీ పుష్పాంగిని అవమానించాలని కలనైనా తలవలేదే ?

నిరపరాధులనే దైవం ఎందుకు దండిస్తాడు.

కలియుగం రాగానే విచక్షణ జ్ఞానం ఆయనకు కూడా దూరమైందా, ఐనా ఏమిటిది ? ఒక ఆడపిల్ల మాటలని పట్టుకుని నేను నాస్తికుడై పోతున్నాను, అందుకనే స్త్రీ బుద్ధి ప్రళయాంతకం అని అన్నారు.

ఆలోచనలు ఎప్పుడు అంతమైయ్యాయో, నిద్ర ఎప్పుడు పట్టిందో తెలియదు కాని, ఏదో పడ్డ శబ్దం విని కన్ను తెరిచి చూసేసరికి తెల్లవారింది,. సూర్యుడు తూర్పు కొండనెక్కి వడివడిగా పైకి వచ్చాడు.

రోజులు గడిచిపోతున్నాయి. ప్రతిరోజూ కాలేజీవేళకు శ్యామలని చూడాలని అనిపించేది. కాని ఆ పిల్ల అన్న మాటలు గుర్తుకు వచ్చి కోపం వచ్చేది. నన్ను అవమానించిన వ్యక్తితో మాట్లాడటానికి నేను ప్రయత్నం చేస్తే అది నన్ను నేను కించపరచుకోవడం అన్న మాట !

మామూలు వేళకంటే రోజూ ఒక అరగంట ముందరే కాలేజీకి వెళ్ళిపోయేవాడిని. ఒంటరిగా వున్నప్పుడు శ్యామల గుర్తుకు వచ్చేది. మనస్సుకి అర్థంకాని బాధ కలిగేది. మనస్సుని బలవంతంగా చదువు మీదకు తిప్పుకునేవాడిని.

ఒక రోజున కాలేజీ నుంచి యింటికి వచ్చాను. ప్రభ వీక్లీ పోస్టులో వచ్చింది.

చూద్దమని గదా అందులో నా ఫొటో ఒకటి పడ్డది. ఎడమొహం పెడ మొహంగావున్న పావురాయిల జంట ఫొటో, వీక్లీ తీసుకుని పై డాబా మీదకు వెళ్ళి చదవటం మొదలు పెట్టాను. ఎండ తగ్గింది. చీకటి వచ్చింది. చీకటి తగ్గింది వెన్నెల వచ్చింది. వెన్నెల వచ్చి యీ పావురాయిల జంటమీద పడ్డది. పావురాయిల వంక చూశాను. మళ్ళీ వెన్నెల వంక చూశాను. రామకృష్ణశాస్త్రిగారి పాట గుర్తుకు వచ్చింది.

ఏదో సాకులో ఎవరికి వారే

ఎదమై పెడమో మైతే

వెంపర లాడే పున్నమితో

వేగేదెల్లా తెల్లవారిదెల్లా ?

ఆ చరణంతో బాటు శ్యామలన్న మాటలు మళ్ళీ మనస్సులో మసిలాయి.

నిజమే ఆ పిల్ల అన్న మాటలలో తప్పేముంది ? పరిచయం లేని పరాయి ఆడపిల్లని పలుకరించడం తప్పు కాదా ?

అల్లా అంటే నేను ఒప్పుకోను. ఈ జన్మలో ఎరుక లేకపోవచ్చు. కాని శ్యామల నా యుగయుగాల సఖి అని నా మనస్సు వెయ్యి గొంతుకల ఘోషిస్తుందే పలుకరించకుండా ఎల్లా వుండను ? అనాదిగా తెలిసిన ఆత్మీయురాలు కన్నుల ఎదుట నిలచితే నోరార పిలువకుండా, ఎల్లా వుంటాను. అది నావశం కాదే ?

అంత వశం కాకపోతే, తెల్లవారురుఝామునే లేచి, చన్నీటి స్నానం చేసి, చదువుకుంటూ కూర్చో అని అంతరాత్మ సలహా యిచ్చింది.

తొలి కోడి కంటె ముందరే లేచాను. స్నానం చేశాను. పుస్తకం పట్టుకొని కూర్చున్నాను. కాని చదువు సాగితేనా ? ఇంజనీయరు గారి అమ్మాయి నాకంటే ముందరే లేచింది. వసారాలో వచ్చి తల దువ్వుకుంటూ

నీవేనె యీ వెన్నెల

నీవే యీ తుమ్మెద

సడిలేని నడిరేయిగా

జవరాల మనమోదమా.....

అంటూ కూనిరాగంగా పాడుకుంటుంది. దైవం నీకు ఎంత చక్కటి గొంతుక యిచ్చాడమ్మా! ఆ పిల్లని మనస్సులోనే అభినందించాను. ఆపాట విన్న తరువాత, బయట వెలుగు వచ్చినా నా మనస్సులో మాత్రం చీకటిగానే వుంది.

పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. చదవలేకపోతున్నాను. క్లాసు రాకపోతే, యింతకాలం యిన్ని సంవత్సరాలు పడ్డశ్రమ గంగపాలు. ఏమీ తోచలేదు.

చర్చికి వెళ్ళాను. ఫాదరు నెంచూరియిన కనిపించాడు.

“ఏం అల్లా వున్నావేం ?” అని అడిగాడు.

ఆ నిర్మలమూర్తితో అబద్ధం చెప్పడానికి నా మనస్సు బప్పుకోలేదు. పూసగుచ్చినట్టు అంతా చెప్పేశాను. ఆయన శ్రద్ధతో ఒపికగా విని చిరునవ్వుతో

‘యూ ఆర్ ఇన్ లవ్’ అని అన్నాడు. నేను రాకెట్టులాగా గాలిలోకి ఎగిరి క్రింద పడ్డాను.

మై గాడ్ ! సో దిస్ యీజ్ లవ్ (My God ! So this is Love)

Yes my son. This is love.

ఐతే నన్నేం చెయ్యమంటారు ? నాకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి.

ప్రేమ కలిగేటప్పుడు నీ యిష్టా యిష్టాలు, వీలు, సాలు చూసుకుని రాదు. మనయిద్దరికి అర్ధం కావటానికి అతీతమైన శక్తేదో ప్రేమని ప్రోద్బలం చేస్తుంది. నిరాశతో నిస్పృహతో మనం దేన్న పొందలేము. ప్రేమని సాధించటానికి ఉన్నీ ఉపాయమల్లా ఒకటే ప్రార్ధన “Prayer”

ప్రార్ధనా !

ప్రార్ధనే, ప్రార్ధన సాధించలేని దేమీలేదు Many things are wrought by prayer.

‘ఎవరిని ప్రార్ధించమంటారు ! ఏమని ప్రార్ధించమంటారు !’

నీలోని లోపాలు సరిదిద్దమని దైవాన్ని ప్రార్ధించు.

మాట్లాడకుండా యింటికి వచ్చేశాను. పరీక్షలో ఎల్లాగైనా క్లాసు రావాలని మొండిగా చదవటం మొదలు పెట్టాను. నిజం చెప్పాలంటే చదువు ధ్యాసలో శ్యామల మాట మనస్సుకి రవ్వం దూరమైందని అపోహపడ్డాను.

ఆ రోజున పగలంతా చదివి చదివి విశ్రాంతి కోసం బీచికి వెళ్లాను. దేవీ ప్రసాదరాయ చౌదరి శ్రమజీవుల విగ్రహం దగ్గర కూర్చొని మదరాసు సెనేటు భవనం వంక చూస్తూ కూర్చున్నాను. ఎర్రటి కాంతులు వెదజల్లుతూ సూర్యుడు నల్లటి మబ్బుల వెనుక దాక్కోనడానికి పడమటి దిక్కుకు ప్రయాణం చేస్తున్నాడు. చూస్తూ కూర్చున్నవాడిని ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. ఎదురు పేవ్‌మెంటు మీద నుంచి ఎవరో పిల్ల యిటు వస్తోంది. అంతా శ్యామల తీరే. నా దగ్గరకు వచ్చింది. నన్ను దాటి వెళ్ళిపోయింది. ఆపిల్ల కమలో విమలో శ్యామల మాత్రం కాదు. మబ్బువంక చూశ్యాను. మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది. మబ్బు నుంచి నాలుగు కన్నీటి చుక్కలు రాలాయి. పేవ్‌మెంటు మీద జనం నలుదిక్కులు రాలాయి. పేవ్‌మెంటు మీద జనం నలుదిక్కులా పరిగెత్తారు. శిలావిగ్రహం దగ్గర అంతకంటే

శిలావిగ్రహం లాగా నేను నిలబడ్డాను. మనస్సు గద్గదమైంది.

అంతలోనే వాన వెలిసింది. వెంటనే ఎండ వచ్చింది. మబ్బు వదిలిన ఎండ తారు రోడ్డు మీద పడగానే, వాన నీళ్ళు ఆవిర్లు కమ్ముతున్నాయి. ఆ తాపానికి భరించలేక చకచకా నడిచి, ఆక్వేరియం హోటలు చేరాను. లోపల నుంచి లతామంగేష్కరు కంఠం 'కహీదీప్ జలే ఔర్ దిల్‌కి' అని పాడుతోంది. ఆ పాట వినగానే మనస్సుకి శ్యామల యిక్కడ వుందేమో ననిపించింది. వుంటే బాగుండును అని హృదయానికి అనిపించింది. జ్యాక్ బాక్సుకు దగ్గర వున్న కుర్చీలో వెళ్ళి కూర్చున్నాను. పాట పూర్తయింది. నేను వెళ్ళి ఒక పావలా దాంట్లో పడేశి, మళ్ళీ ఆ పాట కోసమనే మాటనొక్కాను. విసుక్కోకుండా కోప్పడకుండా లతా మంగేష్కరు కంఠం 'కహి దీప్ జలే ఔర్ దిల్‌కి'' అంటూ మళ్ళీ పాడటం మొదలు పెట్టింది.

పాట వింటున్న వాడిని ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. ఫ్యామిలీ రూమ్‌లోంచి వచ్చేదెవరు ?

రాధ..... శ్యామల

శ్యామల ముఖంలో చిరునవ్వు లేదు. మనిషి చాలా అలసిపోయినట్టు కనిపిస్తోంది. నేను ఆ ప్రయత్నంగానే నేను నిలబడ్డాను. మొదటగా రాధ నా వంక చూసింది. గుర్తుపట్టింది. చిరునవ్వు నవ్వింది.

నేను 'నమస్తే' అని అన్నాను.

పరధ్యానంగా వున్న శ్యామల ఉలిక్కిపడి నా వంక చూసింది. 'హల్లో!' అని అన్నది.

'కూర్చోండి !' అంటూ ఆహ్వానించాను ఇద్దరూ కూర్చొన్నారు. మళ్ళీ యింకొక రెండు కాఫీ త్రాగుతూ వుండగా

'ఆడవాళ్ళ మీద కోపం పోయిందా' అని రాధ అడిగింది.

నేను ఉలిక్కిపడి .... I beg your pardos అని అన్నాను.

రాధ నవ్వి 'ఆడవాళ్ళ మీద కోపం పోయిందా?' అని అడిగింది.

కోపమా ? నాకెవరి మీద కోపం లేదే !

'ఐతే సినిమాలో సీత మీద కోపం పోయిందన్న మాట'

సీతా ? ఓ, అదా ! ఇంటికి వెళ్లగానే మరిచిపోయాను. కాని ఆ విషయం గురించి ఆలోచిస్తూ వుంటే సీతయందు నాకొక క్రొత్త గౌరవం ఏర్పడింది. ఈ సినిమాలో దేవిక నాఅభిమాన నటియైంది. ఆవిడలో యింత ప్రతిభ వున్నదని, నేను ఎన్నడు వూహించలేదు.' అంటూ శ్యామల వంక తిరిగి

"మరళీమీద మీ కోపం పోయిందా" అని అడిగాను.

'అదృష్టానికి దూరమైన వాళ్ళని చూసి మనం జాలిపడాలి, ద్వేషించకూడదు' అని శ్యామల సమాధానం మిచ్చింది.

వెయిటరు బిల్లు తీసుకు వచ్చాడు. బిల్లు చెల్లించి నేను అప్రయత్నంగా గడియారం వంక చూసుకున్నాను. స్నేహితురాళ్ళిదరు ఒక్కక్షణం కళ్ళతో మాట్లాడుకున్నారు.

'ఏదైన ఎంగేజిమెంటు వుందా' అని రాధమ్మ అడిగింది.

"పరీక్షలు వస్తున్నాయి. ఇంటికి వెళ్లి చదువుకోవాలి" అని అన్నాను

'యూనివర్శిటీ ఫష్టుకోసం ట్రై చేస్తున్నారా ?'

'అంత దురాశలేదు. క్లాసు వస్తే చాలు'

"మీకు తప్పక వస్తుంది." అని శ్యామల అంది.

"థాంక్యూ"

ముగ్గురం కలిసి బయటకు వచ్చాం. ప్రెసిడెన్సీ కాలేజి రోడ్డు క్రాసింగ్ దగ్గర ఆగాం. ఇద్దరు మళయాళీ అబ్బాయిలు, ఒక మళయాళీ అమ్మాయి రాధని పలుకరించారు. వాళ్ళ భాషలో ఏదో మాట్లాడుకున్నారు. రాధ వాళ్ళకి మా యిద్దరిని పరిచయం చేసింది.

అందులో ఒక అబ్బాయి తమంతా సినిమాకు వెడుతున్నామని, మేము కూడా వస్తే సంతోషిస్తామని చెప్పాడు.

"నేను మొదట్లో చెప్పిన కారణమే చెప్పి సారీ" అని అన్నాను. శ్యామల ఏదో చెప్పింది. రాధ వాళ్లతో కలిసి వెళ్లిపోయింది. నేను శ్యామలా ఒంటరిగా మిగిలాం.

'నేను ఇంటికి వెడుతున్నాను' అని శ్యామలతో అన్నాను.

"నేను వస్తున్నాను" అని శ్యామల అంది.

ఇద్దరం టాక్సీ ఎక్కాం. 'ఎక్కడికి పోతారు సార్' అని టాక్సీవాడు తెలుగులో అడిగాడు. నేను 'టీ నగరు' అని సమాధానం చెప్పాను. దోవపొడుగునా యిద్దరం ఏం మాట్లాడకోలేదు. వాణీ మహలు దగ్గర మమ్మల్ని యిద్దరిని దింపి టాక్సీ వెళ్ళిపోయింది.

ఒక్క క్షణం యిద్దరం పేవ్‌మెంటు మీద మౌనంగా నిలబడ్డాం.

"నేను గుడ్ నైట్" అని అంటూ అక్కడ నుంచి బయలుదేర బోయాను. శ్యామల ఏం మాట్లాడలేదు. మెల్లిగా 'గుడ్‌నైట్' అని తాను అక్కడే నిలబడ్డది.

నేను నాలుగు అడుగులు ముందుకు వేశాను. కాని మనస్సు ముందుకు సాగలేదు. వెనక్కి తిరిగి చూశాను. శ్యామల యింకా అక్కడే నిలబడి వుంది.

నేను వెనక్కి తిరిగి ఆ పిల్ల దగ్గరకు వెళ్లాను.

"ఐ యాం సారీ" అని అన్నది.

దేనికి ?

'మీకు చాలా కోపం తెప్పించాను'

కోపం రాలేదు కాని చాలా బాధ కలిగింది.

ఎందుకని ?

మీరన్న మాటలు నిజం కాక పోవడం వల్ల ! మీ మనస్సులో నా యందు ఎటువంటి చులకన భావం వుందో గ్రహించాను. చాలా బాధ కలిగింది.

అందుకనేనా కనిపించటం మానేశారు ?

కనిపిస్తే మిమ్మల్ని పలకరించ బుద్ధి అవుతుంది.

నిజం

ముమ్మాటికి

ఇల్లా ఎంత కాలం దాక్కుందా మనుకున్నారు.

మంచి రోజులు వచ్చేదాకా

ఎదుటబడితే మంచిరోజులు అవే వస్తాయి. పారిపోతే దూరమవుతాయి.

నిజం !

ముమ్మాటికి !

థాంక్యూ శ్యామలాదేవి

మరిచిపోయారు.

ఐ యాం సారీ. థాంక్యూ శ్యామలగారు.

మైబైలు పోస్టాఫీసు మా ముందర నుంచి వెళ్లిపోతోంది. నేను మళ్ళీ గడియారం వంక చూసుకున్నాను.

'గుడ్‌లక్ టుయూ' అని శ్యామల అంది.

థాంక్యూ... గుడ్‌నైట్.

ప్రతి శనివారం ఆక్వేరియం హోటలుకు వస్తారా !

అని నియమంలేదు... మీరూ రాధా వస్తారా !

చెప్పలేం.

మళ్ళీ ఎప్పుడు కనిపిస్తారు !

ఇల్లాగే ఎప్పుడో.

అంటే !

అనుకోకుండా అదృష్టం కలిసి వచ్చినప్పుడు.

అర్థం కావటంలేదు.

మీ కాలేజీటైము మారినట్టు మా కాలేజీ టైమ్సు మారలేదు. మేం ఎప్పుడూ మామూలే, గుడ్‌నైట్.

గుడ్‌నైట్.

ఇంటికి వచ్చానన్న మాటేగాని కాలు భూమిమీద నిలవటం లేదు. మేఘాల్లో తేలిపోతోంది. భోజనం చేద్దామని క్యారియరు తెరిచాను. బల్లమీద అరటి ఆకుపరిచాను. క్యారిలోని గిన్నెలు విడివిడిగా తీసి పెట్టాను. కాని ఆకలి మాట మరిచిపోయాను.

"ప్రతి శనివారం ఆక్వేరియం హోటలుకు ఆక్వేరియం హోటలుకు వస్తారా ?" అని ఎవరో నన్ను అడుగుతున్నారు. చూపు అన్నం మీద నుంచి మరలి గోడ మీద వున్న రంగు రంగుల క్యాలెండరు మీద నిలిచింది. శ్యామల లాంటి కుసుమకోమలి ఎవరో, విరహగీతం కాబోలు, ఆలపించి, వీణమీద తలవాల్చి, ఏదో పరాకుగా, వాలిన కన్నులతో అంతర్ముఖియై దిగులుగా వున్నట్టుగా వుంది.

కాని నా మనస్సులో దిగులుకు నిరాశకు తావు లేదు. ఆపరాని ఆవేశంతో అంతులేని ఆనందంతో పరవళ్ళు తొక్కే నా మనస్సు శ్యామలని తలచుకుని ఆనందంతో

'నిదుర బరువులు నన్ను విడచుటేనాడో'

" నీవు నా మ్రోలనే నిలచుటేనాడో" అంటూ పాడటం మొదలు పెట్టాను. అల్లా ఎంతసేపు పాడానో నాకు తెలియదు. ఎవరిదో నీడ నా మీద పడ్డది. ఒక కంఠం నన్ను "మామా" అని పలుకరించింది. నేను చిరునవ్వుతో ఆ మనిషి వంక చూసి, ఇలస్ట్రేటెడు వీక్లీ తీసి యివ్వబోయాను. వచ్చిన బాలుడు ఒక గిన్నె నా బల్ల మీద పెడుతూ.

"అమ్మ అవియల్" ఇచ్చి రమ్మంది అని అన్నాడు.

"మరి కోళం బో ?"

సోమవారం

థాంక్యూ

ఆవియల్ చూడగానే అంతులేని ఆకలి పుట్టుకొచ్చి పని చేసేదానికి, ఒక్క మెతుకన్న మిగల్చకుండా క్యారియరంతా ఖాళీచేసి, పెద్ద దీపం ఆర్పి చిన్నదీపం వెలిగించి, 'థియరీ ఆఫ్ రెలిటవిటీ' చదవటం మొదలు పెట్టాను. గది బైట వరండాలో ఎవరో మెల్లిగా దగ్గారు.

మే ఐ కమిన్ (May I come in) అని అన్నారు. తల ఎత్తి చూద్దును గదా మూడో అంతస్థులోకి క్రొత్తగా వచ్చిన విశ్వంగారు.

రండి ! ప్లీజ్ కమిన్ వి నేను అనగానే ఆయన వచ్చి పడక కూర్చీలో కూర్చున్నారు మీరు యిందాక పాడిన పాట విన్నాను. చాలా బాగుంది." అని అన్నారు.

పాట ? బాగుందా ?

బాగుందా ? చాలా బాగుంది. మీరు యింకొకసారి పాడితే విందామనే ఆశతో వచ్చాను.

ఈసారి నిరాశ పొందవచ్చు.

ఎందుకని ?

పాట కచ్చేరీలు చేశే అలవాటు నాకు లేదు

అది కాదండి.

ఎదుట మనిషి వుంటే నాకు వచ్చే వన్నీ అపశృతులే.

అల్లా అనకండి మీది చాలా సాధన చేసిన కంఠంలాగా కనిపిస్తోంది.

సాధనా ? నేను చేసిన సాధనంతా స్నానాల గదిలోనే.

ఈ మాటలకేం లేండిగాని, ఆ పాట యింకొక సారి పాడమని ప్రార్ధన.

నేను ఆయనవంక చూశాను. ఈ మనిషి నిజంగా నా పాట మెచ్చుకునే వచ్చాడా? లేకపోతే అర్ధరాత్రివేళ యీ అంకమ్మ శివాలే మిటని వేళాకోళం చెయ్యడానికి వచ్చాడా ? ఇటువంటి మనిషికి ఒక్కసారి బాగా బుద్ధి చెప్పాలి. అని అనుకుని మళ్ళీ పాడటం మొదలు పెట్టాను పాట ప్రారంభం కాగానే యింట్లో అన్ని భాగాలలోంచి నిశ్శబ్దం విశ్వం గారొక్కడే కాదు. అనేక కంఠాలు యీ పాటలు వింటున్నాయి.

ఈ పాటవిని వాళ్లంతా జోహారనడమో లేకపోతే నెలాఖరుకు యిల్లు ఖాళీ చేయించడమో ఏదో ఒకటి జరగాలి. అని మనస్సులో అనుకుని పాడటం మొదలు పెట్టాను. పాట వింటూంటే నాకే చాలా బాగుందనిపించింది. పాట పూర్తయింది. మా(శ్రోత ఏం మాట్లాడలేదు. మిగతా భాగాల్లో నిశ్శబ్దం భంగమైంది. విశ్వంగారు కళ్లు మూసుకుని.

'ఎంత చక్కటి కంఠం ! అని అన్నాడు.'

ఎవరిది ?

మీదే మీరు స్టై బ్లాకు ఎందుకు పాడకూడదు ?

పాడచ్చు ! కాని ఒక్క చిక్కుంది.

ఏమిటది ?

'ఇప్పుడు పాడే వాళ్ళంతా నాకంటె బాగా పాడేవాళ్ళే'

'అల్లా అంటే నేను ఒప్పుకోను. వీళ్ళు తమ ప్రతిభని వినియోగించుకున్నారు. నేను ఉపయోగించుకోవటం లేదు. చూడండి, విశ్వంగారూ, నాలాగా, నాకంటె అనేకరెట్లు బాగా పాడేవాళ్ళు యీ దేశంలో అనేక మంది ఉన్నారు. నేను యీ వూరు వచ్చింది. లెక్కలలో గట్టివాడిని కావడానికి. దీంట్లో యెప్పుగా లెక్కలలో గట్టెక్కితే మావాళ్ళు పారిసు పంపిద్దామని అనుకుంటున్నారు.

'గుడ్ ! బాగుంది !'

నేను లెక్కల పుస్తకం తెరిచాను. విశ్వంగారు 'గుడ్‌నైట్ ! థాంక్యూ ఫర్‌ది సాంగ్ అంటూ వెళ్లిపోయారు. ఆయన వెళ్లగానే, నేను పుస్తకం మూసేసి, శ్యామలలాంటి పిల్ల క్యాలెండరు వంక చూస్తూ ఆలోచిస్తూ ఎప్పుడు కన్ను మూశానో తెలియదు. అనుకోకుండానే ఆదమరిచి నిదురపోయాను. అలవాటుగా కోడితో పాటు లేచాను. స్నానం చేసి పుస్తకం పట్టాను.

నిదుర బరువులు నన్ను విడచుటేనాడో

నీవు నా మ్రోలనే నిలుచుటేనాడో అని మా పేట లతామంగేష్కరు పాడుతోంది. పాట వింటూ అలా రవ్వంత సేపు నిలబడి నా గదిలోకి వచ్చాను. మనసులో నిరాశ, దిగులు, ఒంటరితనం యివన్నీ ఏమయ్యాయో ఏమో ఉషకాంతులు చూస్తూంటే అంతులేని ఆనందం. ఈనాటినుంచి నీ జీవిత పంథాయే మారిపోగదు అని మనస్సు మరి మరీ వక్కాణించింది.

ఆరోగ్యం జాగ్రత్త ! పరీక్షలు వస్తున్నాయి. బాగా చదువు ఆదనంగా డబ్బు కావాలంటే రాయి పంపుతాను అంటూ యింటి దగ్గర నుంచి నాన్న ఉత్తరం రాశాడు. నాన్న చాలా మంచివాడు, కావలసిన దానికంటె ఎప్పుడూ ఎక్కువే పంపుతాడు. అప్పటికీ అదిచాలదేమోనని హైరాణపడుతూ వుంటాడు.

తనవాళ్ళు తన పిల్లలు అని అనగానే మనిషికి అంత మమకారం పుట్టుకు వస్తుంది కాబోలు,

'బాగా చదవాలి నాన్న మనస్సు తీర్చాలి' జాగ్రత్తగా ఆలోచిస్తే చదవాలన్న శ్రద్ధ నాన్న ఒక్కడిని గురించే కాదు. నేను బాగా చదివి క్లాసు తెచ్చుకొంటె నాన్న

ఎంతో సంతోషిస్తాడు. ఆ సంతోషంలో నేను ఏం చెప్పినా కాదనడు. ఆయన మనస్సెరిగి శ్యామల మాట చెవిని వేశానంటే, ఆయన నామాట కాదనడు కాదనకుండా వుండటం కంటే నాకు కావలసినదేముంది.

ఆనాటి నుంచి ఆ ఘడియనుంచి నా జీవితంలో ఒక నూతన అధ్యాయనం ప్రారంభమైంది. ఒక నూతన శకానికి నాంది అయింది. ఒక అపురూప సౌందర్యరాశి నాప్రేమని మన్నించడంకంటే నాకు యింకా ఏం కావాలి ఝ ఆ చెలి చిరునవ్వు చెలిమి నా చెంత వుంటే నేను సాధించలేని దేమిటి ? ప్రతి శనివారం ఆక్వేరియం హోటలలో కలిసేవాళ్లం కాఫీ త్రాగి బీచి ఒడ్డున కూర్చునేవాళ్ళం. మాట్లాడుకుంటూ ప్రపంచకాన్నే మరిచి పోయేవాళ్ళం. శ్యామలా ఎన్నో ఎన్నో యుగయుగాలుగా తెలిసినదానిలాగా మాట్లాడేది. నేను ఆచిన్నదాని మాటలు వింటుంటే శ్యామలతో పరిచయం లేనప్పుడు ఎలా జీవించానా అన్ని ఆలోచిస్తే నాకు అర్థం అయ్యేది కాదు. ఈ వ్యక్తి కోసమే కాబోలు యిలా అహర్నిశలు కలువరించినది.

ఒక శనివారం సాయంకాలం యిద్దరం శాంథోమ్ బీచిలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నాము. పాడుతున్న రేడియో వినిపిస్తోంది. రేడియో హఠాత్తుగా ఆగిపోయింది.

'రామం' అని శ్యామల పిలిచింది.

"శ్యాం !"

"ఒక చక్కటి పాట పాడు"

"నేను పాడటమా ?"

"మీరు బాగా పాడతారని ఇందిర చెప్పింది"

" ఏ ఇందిర"

"ఇందిరని తెలియనట్టు మాట్లాడతారు మీ యింట్లో మేడమీద"

"లతామంగేష్కరా ! ఇందిర నీ కెల్లా తెలుసు ?

'నాతో కలిసి శారదా విద్యాలయంలో చదివింది. నేను ఇందిర కోసం చాలాసార్లు మీ ఇంటికి వచ్చాను.'

నా కెప్పుడూ కనిపించలేదేం ?

ఇరవైనాలుగు గంటలు పుస్తకం పుచ్చుకుని కూర్చుంటే మేమెల్లా కనిపిస్తాము.

'ఇప్పుడు పుస్తకం పుచ్చుకుని కూర్చోవడం మానేశాగా'

మానేయద్దు రామం. నీకు యూనివర్శిటీ ఫస్టు వచ్చినప్పుడు, గోల్డు మెడలు తీసుకుని గవర్నరుకు షేక్‌హేండ్ యిచ్చే నిన్ను మా ఫ్రెండ్సు అందరికీ చూపించి, సంతోషంతో సంబరపడాలని నా కోరిక'

అదే నీ కోరికైతే తప్పక నెరవేరుతుంది. శ్యాం

పాట పాడవూ !

వెన్నెలలో సముద్రం తళతళా మెరుస్తోంది. ఒడ్డున వున్న మెర్క్యూరీ దీపాల కాంతిలో మెరీనా అందం అనన్యంగా వుంది. లైట్ హౌస్ వంక చూసి, ఒక్కసారి శ్యామల వంక చూశాను. రవ్వల దుద్దుల మీద పడ్డ వెన్నెల కాంతులకి, ఆ పిల్ల చెక్కిళ్లు రంగు రంగులుగా మెరుస్తున్నాయి.

నేను పాట పాడటం మొదలుపెట్టాను.

ఆకశాన హంసలాగ మొయిలుకదిలినా

కనులనీడ వాటి కనుల కన్నా మసలినా !

ఆపరాని ఆవేశం

అంతులేని ఆనందం

మనసీయగల వయ్యారి మనసార తనదైనా కలదైనా తీయని వేదనతో జీవితమే తీవెను పూసిన పూవు ఏ దేవుని పూజలకో తన ప్రేమయే దైవము కాదా! కథలు మారినా కలలు  ఆవేశం మారునా ! అపరాని

సంతోషంగా వున్న శ్యామల ముఖం ఒక్కక్షణం చిన్నబోయింది.

తనలో తాను అనుకుంటున్నట్టుగా 'కథలు మారినాకలలు మారినా' అని అన్నది.

మన కథలు, కలలు ఎన్నటికి మారవు శ్యామలా

థాంక్యూ రాం

ఇద్దరం ఇంటికి బయలుదేరాం. శ్యామల కొంచెం సేపు ఏం మాట్లాడలేదు.

అల్లా వున్నావేం ?

ఎల్లా వున్నాను.

మౌనంగా

అంతులేని ఆనందంతో మనస్సు ఉక్కిరి బిక్కిరిగా ఐంది. మాటలు మరిచిపోయాను. ఒక్కమాట చెప్పనా రామం.

'చెప్పు'

నిన్ను రెండు సంవత్సరాలుగా చూస్తున్నాను. నిన్ను చూడగానే ఎవరో ఆత్మీయుడిని చూసినట్టు అనిపించింది. మన యిద్దరికీ పరిచయం కలిగితే బాగుండుననిపించింది.. ఆరోజున హోటల్లో నువ్వు పలుకరిస్తే ఆనందం పట్టలేకపోయాను. అందుకనే కొంచెం సేపు ఏం మాట్లాడలేకపోయాను కాని నువ్వు

పలుకరించినందుకు చాలా సంతోషం వేసింది రామం.

థాంక్యూ థాంక్యూ వెరిమచ్

నేను అనుకున్న దానికంటే కూడా నువ్వెంతో మంచివాడివి రామం. నీ మంచితనం ఎప్పుడూ యిల్లాగే వుండాలని దైవాన్ని ప్రార్థిస్తూ వుంటాను.

'నీ చెలిమి వుండగా నేను ఎన్నటికి మారను శ్యాం'

మెట్లుదిగి ఎవరో మా దగ్గరకు వచ్చి

'శ్యాం' అంటూ శ్యామలని పలుకరించారు. శ్యామల ఉలిక్కిపడ్డది. అంతలోనే సంబాళించుకుని

'నాన్నా వీరు మిష్టర్ రామం. ప్రెసిడెన్సీ లో మేథ్సు పోష్టు గ్రాడ్యూయేట్ చేస్తున్నారు.

'మా నాన్నగారు వీరభద్రరావుగారు' అంటూ ఆయన్ని నాకు పరిచయం చేసింది. నన్ను చూడగానే ఆయన ముఖంలో ఒక్కక్షణం రవ్వంత చిరాకు కనిపించింది. మరుక్షణంలో చిరునవ్వు వచ్చింది.

'గ్లాడ్ టు మీట్ యూ' అంటూ చెయ్యి కలిపారు.

'థాంక్యూ సర్' అని అన్నాను.

'ఇంటికి వచ్చేస్తున్నారా, కొంచెం సేపు కూర్చుంటారా అని ఆయన అడిగారు.

'ఇంటికే బయలుదేరామండి' అని నేను అన్నాను.

'నేనూ వస్తున్నాను. కలిసే వెడదాం' అంటూ ఆయన కూడా మా వెంట వచ్చారు. ముగ్గురం కలిసి టాక్సీలో యింటికి బయలుదేరాం. ఆయన నా చదువు సందర్భం ఏవూరు ఏమిటి వగైరా వగైరా విషయాలు అడుగుతూ ఒక వ్యక్తి పేరు అడిగి.

'ఆయన ఎల్లా వున్నాడు ?' అని అడిగాడు.

'వారు మా నాన్నగారేనండి.' అని నేను సమాధానం చెప్పగానే ఆయన టాక్సీలోనే ఎగిరి గంతువేసినంత పనిచేసి,

'నువ్వటోయి ఇంకా ఎవరో అని అనుకున్నాను. నువ్వు యీ వూళ్ళో వున్నట్టే మాకు యింతకాలం తెలియలేదే ? అమ్మాయి, రామాన్ని ఒకసారన్న మన యింటికి పిలవలేదేం ?

శ్యామల ఏం మాట్లాడలేదు.

'నీ పుటకలికి ముందర, నేను మీ నాన్న నాలుగేళ్ళ ఒక వూళ్ళో కలిసి పనిచేశాం. మనుష్యులం దూరమైనా స్నేహాలు మాత్రం దూరంకాలేదు. నువ్వు యీ వూళ్ళో

చదువుకి వచ్చినట్టు ఆ దొంగ రాస్కెలు ఒక్క ఉత్తరంముక్క రాసిపారేస్తే నష్టమేముంది ?'

ఆయన మాటలలోని ఆత్మీయత ఆదరణ చూస్తుంటే, నాకేం చెయ్యాలో తోచలేదు. ఏం మాట్లాడాలో తెలియలేదు, మాట్లాడకుండా వూరుకున్నా, నన్ను యింటి దగ్గర దింపేసి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇంటికి వచ్చాను. మనస్సంతా నానా గందరగోళంగా వుంది. డర్బీస్వీప్ వచ్చినంత ఉషారుగా వుంది. రెక్కలు కట్టుకుని ఆకాశమంతా ఎగిరి వద్దామనిపించింది. చందమామని చూద్దామని పైడాబా ఎక్కాను. నిజంగా నేనెంత అదృష్టవంతుడిని. ఎంతో పూర్వజన్మపు సుకృతం వుండి, యీ జన్మలో ఎన్నో ఘోరయాతనలు పడి ఎంతో తపస్సు చేస్తేనే కాని కోరినవన్ని లభించవని అంటారే, నా విషయంలో యింత సజావుగా తేలికగా యీ సమస్య పరిష్కారమైందంటే యిదికలయా వైష్ణవమాయయా ! ఆ ఏడుకొండలవాడి మహిమా ? ఆ తిరు నిర్మలచతుర్భుశ రంగనాధుల వారి చలవా ? నా మీద చూపిన యీ ఆవాజ్య అనురాగానికి వాత్సల్యానికి కరుణకు నేను ఏం చేసి వారి ఋణం తీర్చుకోను ? ఐనా దైవానికి భక్తుడికి మధ్య ఋణపణాలేమిటి ?

ఈ వరానికి కారణం నా అదృష్టమా ? శ్యామల మంచితనమా ?

విశ్వంగారి గది తాళం వేసివుంది. ఏం వూళ్ళో లేడా ? క్రిందకు వచ్చాను. ఇలస్ట్రేటేడ్ వీక్లీ కోసం వచ్చే మేనల్లుడు కనిపించి నన్ను చూసి పలుకరించకుండానే వెళ్ళిపోయాడు. నా గదిలోకి వెళ్ళబోతుండగా ఇంజనీయరుగారు నన్ను పిలిచారు. ఒక ఉత్తరం యిచ్చారు.

నాన్నకి,

నాకోసం వెతికించడానికి ప్రయత్నం చెయ్యడం అనవసరం. నేనూ విశ్వంగారు నిన్న రిజిష్టరు మ్యారేజి చేసుకున్నాం. నీకూ నీ మూఢనమ్మకాలకు దూరంగా వెళ్ళిపోతున్నాం. నా వల్ల ఒక్కటే ప్రార్ధన. తమ్ముడి బ్రతుకు కూడా నాశనం చెయ్యవద్దు.

అమ్మకు నేను, విశ్వంగారు నమస్కారం చేస్తున్నాం. కోపగించకుండా ఆశీర్వదించుతారని నమ్ముతున్నాను.

ఇందిర.

'నేను దానికి పెళ్ళి చెయ్యననా రామం ! నాతో మాట మాత్రంగా చెప్పకూడదా? నలుగురిలో నేను తలెత్తుకుని ఎట్లా తిరగను ?'

ఆయన వంక మాట్లాడకుండా ఒక్క క్షణం చూశాను. ఆయనతో మాట

మాత్రంగా చెబితే ఏం జరిగి ఉండేదో నాకు తెలుసు.

'జరిగినదేదో జరిగిపోయింది. ఇంటికి పిలిపించి, గుట్టుచప్పుడుకాకుండా ఏ తిరుపతి తీసుకువెళ్ళి స్వామివారి సన్నిధిలో ఆ మూడు ముళ్ళు వేయించండి, కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్టు కట్నం కానుకల బెడద లేకుండా, యోగ్యుడైన అల్లుడు దొరికాడు.

'విశ్వం చాలా మంచి వాడోయి ! ఇల్లా ఎందుకు చేశాడో అర్ధం కావటం లేదు.'

"మీకు యీనాడే కాదు దశాబ్దం నుంచి యీ సమస్య అర్ధం కావటం లేదు" అని నాలో నేను అనుకుని.

'చిన్నవాళ్ళు మీతో చెప్పటానికి జంకి వుంటారు' అని అన్నాను. 'అమ్మాయికి పెళ్ళి చెయ్యాలి. ఆఫీసులో వాళ్లందరికి పెద్ద పార్టీ యివ్వాలి. అని ఎంతో అనుకున్నాను రామం'.

ఇప్పుడు మాత్రం మించి పోయిందేముంది అశోకలోనో, ఉడ్‌లాండ్స్‌లోనో ఒక పెద్ద పార్టీ యివ్వండి.

'ఏమిటో రామం యిది చాలా కాని పనిలాగా కనిపిస్తోంది.'

'కాని జరిగిపోయిందిగా, సర్దుకుపోవటం మంచిది. ఇద్దరూ బుద్ధిమంతులు, మనకు ఎంతో కావలసినవాళ్లు.'

ఏమిటో రామం చిన్నవాడివైనా నీతో మాట్లాడితే కొండంత బరువు తీరినట్టుగా వుంది. పార్టీ యివ్వటానికి ఎక్కడ బాగుంటుందంటావు ?

అశోకలో యివ్వండి.

వాళ్ళేదో (Little Hut) అని కట్టారట. దాంట్లో యిద్దాం. ఈ నాలుగు రోజులూ నువ్వు నాకు చేదోడుగా వుండాలి.

'మీరు ప్రత్యేకంగా చెప్పాలా, మేమంతా మీ మనుష్యులమే.'

'వాళ్ళు ఎక్కడ వున్నారో మనకి ఎల్లా తెలుస్తుంది.'

ఆ విషయం రేపు విచారించుదాం. మీరు మాత్రం వాళ్ళని ఏమీ అనినని నాకు హామీ యివ్వాలి.

'వాళ్ళు క్షేమంగా యింటికి వస్తే చాలు. వాళ్ళని నేనేం అనను.

రాత్రి చాలాసేపటి వరకూ ఇందిరా విశ్వాలని గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. మరునాడు ఉదయం కాఫీ త్రాగగానే, కాలేజీకి శెలవు పెట్టి ఊరిమీద పడ్డాను. ఊళ్ళో వున్న హోటళ్ళన్నీ గాలించడం మొదలుపెట్టాను. దొంగలిద్దరు దగ్గరలోనే దొరికారు. హనీమూన్ దంపతులు హోటలు కాటేజిలో భోజనం చెయ్యబోతున్నారు.

నన్ను చూసి నివ్వెరపోయారు. ఇందిర ఎంతో భయపడ్డది. విశ్వం తప్పుచేసిన వాడిలాగా నిలబడ్డాడు.

'మీరిద్దరూ యిటువంటి వాళ్ళని ఎప్పుడూ అనుకోలేదు.' అని నేను కఠోరంగానే అన్నాను.

ఇందిర గుడ్లనీరు కక్కుకుంటూ 'మామ!' అని అంది.

విశ్వం చూపులు నా పాదాలని తాకుతున్నాయి.

నేను ఒక్కక్షణం వాళ్ళవంక చూసి 'కంగ్రాచ్యులేషన్స్' అని అన్నాను.

ఆ గదిలో ఆవరించిన భయంకర వాతావరణం ఒక్కక్షణంలో పటాపంచలైంది. య్దిరి ఆనందం నన్ను ఆకాశంపమీదకు ఎత్తింది. నా కంటె పెద్ద విశ్వంగారు, నాకంటె చిన్నది ఇందిరా యిద్దరూ కలిసి నాపాదాలకి నమస్కరించారు.

ఆ క్షణంలో నేను అరవైయేళ్ళ వృద్ధుడినైనట్టు అనిపించింది. వాళ్ళని చూస్తుంటె, సంతోషంతో నా కళ్ళలో ఆనందబాష్పాలు నిలిచాయి. కూతురిని అల్లుడిని చూసినట్టు అనిపించింది. 'మీ యిల్లు పది యిళ్ళు కావాలి' అని వాళ్ళని మనస్సులోనే దీవించాను. మిలమిల మెరిసే కళ్ళతో ఇందిర

'మా మీద కోపం వచ్చిందా మామా' అని అడిగింది.

'కోపం వస్తే యింతదూరం రానుగా'

నాన్న ఏమన్నారు.

మెళ్ళో మంగళసూత్రం లేకుండా యింటికి వస్తే మీయిద్దరి భరతం పట్టేట్టున్నాడు.

'నన్ను గురించి ఏమన్నా అన్నారా !' అని విశ్వం అడిగాడు.

ఎంతో మంచివాడనుకున్న మనిషి యిల్లా చేశాడేమిటా అని ఆశ్చర్యపోతున్నాడు.

నాన్న నా మీద కోపంగా వున్నాడా ?

నీ పెళ్ళి చేసి వాళ్ళ ఆఫీసులో వాళ్ళందరికీ పెద్ద పార్టీ యిద్దామని అనుకున్నాడట. అదేమో మీరు పడనివ్వలేదు.

'మామా ! ఒక్కమాట అడగనా'

'ఊఁ'

నేను చేసిన పని తప్పా మామా !

గాంధర్వ వివాహమని పూర్వం వుండేది. అది యీ మధ్య అడుగున పడ్డది. దాని బైటికి తీసి మీరు యిద్దరూ ఉద్ధరించారు. ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకోవడం, అతనికి నీడలోనీ మనుగడ నిలుపుదామని కోరడంలో ఏం తప్పు

లేదమ్మా.

'నువ్వెంత మంచివాడివి మామా' అంటు ఇందిర వెక్కి వెక్కి ఏడుస్తూ కుర్చీలో కూర్చోని ముఖం రెండు చేతుల్లో దాచుకుంది.

విశ్వం తెల్లబోయి చూస్తున్నాడు.

'మీఫ్యూ' చర్ప్రోగ్రామ్ ఏమిటి? అని నేను అతన్ని అడిగాను.

తిరుపతి వెళ్ళి గుళ్ళో పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాం. ఈ ఊళ్ళో ఎక్కడైనా పోర్షను తీసుకుని కాపురం పెడదామని బాగుంది. పెళ్ళికి మమ్మల్నెవరిన్నీ పిలవరా !

నువ్వు వస్తావా మామా ! నిజంగా వస్తావా !

మీ నాన్న అమ్మా తమ్ముడూ అంతా వస్తారు.

'మామగారూ వాళ్లు వస్తారా' అంటూ విశ్వం భయపడ్డాడు. కన్యధార పోసే అవకాశం ఆయనకి యివ్వకపోతే ఆషాఢపట్టి యివ్వడు. ఆశ్వయుజమాసం పండుగలకి పిలవడు.'

ఏం చెయ్యమంటారు.

'తిరుపతి చేరగానే మామగారి పేర టెలిగ్రాము ఇవ్వండి. పెళ్ళిచేసుకుని లక్షణంగా అంతా కలిసి యింటికి రండి.'

'మామా మీరు కూడా తిరుపతి రండి' అని ఇందిర అంది.

'రావాలనే వుంది కాని ఒక్క చిన్న చిక్కుంది. ఒంటరిగా తిరుపతి యాత్ర చెయ్యకూడదని నా నియమం అని అన్నాను.'

'మేమంతా వున్నాంగా' అని విశ్వంగారు అన్నారు. నా ముఖంలో చిరునవ్వు పసికట్టిందో ఏమో ఇందిర.

'అత్త వస్తే కాని యాత్ర చెయ్యవన్నమాట అంతేకాదూ. అత్త ఎప్పుడు వస్తుంది మామా ? అని అడిగింది.

నేను ఒక్కక్షణం ఏం మాట్లాడలేకపోయాను. ఎవరి విషయంలోనైనా అబద్ధం చెప్పవచ్చు. కాని వెంకన్న గారి విషయంలో ఎల్లా ! నా మనస్సులోని మాట యీ చిన్నది ఎంత తేలికగా పసికట్టేసింది. 'దైవం అనుకూలిస్తే త్వరలోనే' అని చెప్పక తప్పలేదు.

'మాతో బాటు భోజనం చెయ్యండి మామా' అని ఇందిర ఆహ్వానించింది.

అంత కంటేనా.

ముగ్గురం కలిసి సరదాగా భోజనం చేశాం. ప్రక్కనున్న బట్టలషాపులోంచి

ఇందిరకు ఒక పట్టు రవికలగుడ్డకొని ప్రజెంటు చేశారు.

ఏనుగెక్కినంత సంబరంతో యింటికి వచ్చాను. ఇంజనీయరు గారి యింటి తలుపులు మూసివున్నాయి. ఇందిర తమ్ముడు ఒక్కడూ కిటికీలో దిగులుగా కూర్చున్నాడు. చేత్తో సైగ చేసి వాడిని పిలిచాను.

నాన్న యింట్లో వున్నాడా ?

ఆఫీసుకు వెళ్ళాడు. ఉద్యోగం మానేస్తాడట.

అమ్మ ఏం చేస్తోంది.

గదిలో కూర్చుని ఏడుస్తోంది.

ఆవిడ దగ్గరకు వెళ్లాను జరిగినదంతా చెప్పాను. ఇంజనీయరు గారికి ఎల్లాగైనా నచ్చచెప్పి తిరుపతి వెళ్ళిరమ్మని చెప్పాను. కూతురు కులాసాగా వున్నదని తెలియగానే ఆవిడ మనస్సు కుదుటపడ్డది. కళ్ళనీళ్ళు తుడుచుకుని తల దువ్వుకోవడం మొదలుపెట్టింది. ఈ కాండ పూర్తి అయ్యేసరికి మధ్యాహ్నం నాలుగు గంటలైంది కాలేజీకి ఎల్లాగూ వెళ్లలేదు పోనీ శ్యామల వాళ్ళయింటికి వెడదాం అనుకుని మస్తుగా ముస్తాబై ఫ్రెంచి టెరిలిన్ట్రై కట్టుకుని వాళ్ళయింటికి వెళ్ళానన్న మాటే గాని శ్యామలని పేరు పెట్టి పిలవడానికి సిగ్గువేసింది. తలవంచుకుని తటపటాయిస్తూ నిలబడ్డాను. నన్ను చూసి ఎవరో యిటు వస్తున్నారు.

ప్రియురాలి పారాణి పాదాలు చూద్దామని ఎంతో ఆశతో నిలబడ్డాను. ఫ్లెక్సు ఏడో నెంబరు పాదాలు నన్ను సమీపించాయి.

'రావయ్యా !' అంటూ నన్నో పురుష కంఠం పలుకరించింది. నేను సిగ్గుపడుతూ ఆయనకు ఎదురువున్న కుర్చీలో కూర్చున్నాను. కొద్ది క్షణాలకు యింట్లోంచి వేడి వేడి కాఫీ వచ్చింది. కాఫీ త్రాగాము. వక్కపొడి వేసుకున్నాం. 'సిగరెట్టు కాలుస్తావా' అంటూ ఆయన స్టేటు ఎక్స్ప్రెస్ టిన్ నా ముందరవుంచారు.

'సిగరెట్టు అలవాటులేదండి' అని అన్నాను. ఆయన నమ్మనట్లు నా వంకచూసి, తనుతాపీగా రెండుసార్లు పీల్చి, పొగవదలి అంతరిక్షంలోకి చూస్తూ ...

అమ్మాయి నిన్ను గురించిఅంతా చెప్పింది. యూనివర్శిటీ ఫస్టు కోసం ట్రై చేస్తున్నావని చెప్పింది. చాలా సంతోషం. చూడు రామం ! శ్యామల యింకా చిన్నపిల్ల అభం శుభం సరిగ్గా తెలియనిది.

....... ........ ........

దాని వివాహం గురించి నేనూ వాళ్లమ్మా యిదివరికే ఒక నిర్ణయానికి వచ్చాం.

ఏమని ?

మా స్నేహితుడి కొడుక్కి యిద్దామని అనుకున్నాం. వాడు ప్రస్తుతం చదువుకుంటూ వున్నాడు. రేపు వేసంగిలో పూర్తి అవుతుంది.

శ్యామల....

మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌లో వాళ్ళమ్మతో కలిసి బెంగుళూరు వెళ్ళింది.

మీరు.....

'నేనేం బలవంతం చేసి పంపించలేదు మా బంధువుల యింట్లో పెళ్ళి. మళ్లీ వారం రోజులలో వచ్చేస్తారు.'

నేను....

మీరు యిల్లా బీచిలకి, సినిమాలకి, షికార్లు కొట్టడం మన సంఘం ఒప్పుకోదు. ఇహ నుంచి మానేయిండి.

నేను........

నేనూ మీ నాన్న చాలా స్నేహితులం. మాలాగానే మా పిల్లలు కూడా స్నేహితులు కావటం నాకు చాలా సంతోషం.

నేను - మరి శ్యామల

శ్యామలతో మాట్లాడటం మానెయ్యమని నేను చెప్పటం లేదు. అప్పుడప్పుడు వచ్చి, యింటి దగ్గర పలుకరించి వెడుతూ వుండు. ఏం ఫరవాలేదు.

'కాదండి'

'నీకు యీ వుళ్ళో ఏ సహాయం కావలసినా నాతో చెప్పు. చేసిపెడతాను.'

నేను మాట్లాడకుండా యింటికి తిరిగి వచ్చేశాను.

శుక్లపక్షం వెళ్లి కృష్ణపక్షం వచ్చింది.

ఇంటికి వచ్చిన గంటకి, శ్యామల వాళ్ళ నాన్నగారి మాటలు నా మీద 'జిన్' లాగా పని చెయ్యటం మొదలుపెట్టాయి.

మా అనుబంధాన్ని ఎంత తేలికగా తుంచేశాడు. మా ప్రేమని ఎంత చులకనచేశాడు. తియ్యటి మాటలతో నన్ను ఎంత అవమానం చేశాడు.

ప్రేమించగలవారికీ ప్రేమలో వుండే బాధ తెలుస్తుంది. అనురాగంలో వుండే ఆప్యాయత తెలుస్తుంది.

ఈ రాతిగుండెల కరుకు కసాయివాళ్లకి ప్రేమలో వుండే విలువ ఏం తెలుస్తుంది?

వారం రోజులు కన్నీరు మున్నీరుగా విలపించాను. నాలో నేను కుమిలిపోయాను.

శాస్త్రంలో 'కలకంఠి కంటి కన్నీరొలికిన అని అన్నారు' గాని కలకంఠుడి కంట

కన్నీరొలికితే ఏం జరుగుతుందో ఎవ్వరూ రాయలేదు. ఎందుకంటే బహుశ ఆ కాలంలోని ధీరో ధాత్త నాయకులు రంకెలు పెడబొబ్బలకే తప్ప యీ శహనారాగం అభ్యాసం చెయ్యకపోవడం వల్లనో మరెందుకనో, ఒక్క ఉత్తర రామాయణం మినహా ఏ ఉద్గ్రంథంలో కూడా యీ విషయం గురించి చెప్పలేదు.

తెలియని వాళ్ళు యీ విషయం గురించి తెలుసుకోవడం మంచిది. ప్రేమలో విఫలులైనవారు, ఫుల్‌స్టాప్, కామా లేకుండా నాన్‌స్టాప్‌గా 'నన్నొకపరి బిట్టగ ఏడ్వనిండు' అన్న ధోరణిలో భోరున ఏడవగలిగితే ఎటువంటిదైనా సరే, కోరిన కాంత కదలిరావలిసిందే, ఎందుకంటే, ఈ శోక తరంగాలు హంఁడ్రెడు కిలోవాట్ల షార్టువేవ్ స్టేషనులాగా ఎటువంటి డిస్టుబెన్సు లేకుండా, సరాసరి ఆవిడ మనస్సునిచేరి, మధనం చేసి, ఎంతటి రాతిగుండెల కరుకువారినైనా, కరిగించి, లాలించి, మనదారికి తీసుకురావలసిందే.

యాతనలో, అంతులేని వేదనలో, ఆరుపగళ్లు, ఆరు రాత్రుళ్ళు గడిచిపోయాయి. ఏడవనాటి ఉదయం నేను కిటికీలోంచి ఇంజనీయరుగారి యింటివంక చూస్తున్నాను. గాంధర్వ వివాహితులు, బొంబాయి మెయిల్లో దిగారు. ఇంట్లో సందడిగా సంబరంగా వుంది. కాని వాళ్ల సంతోషంలో పాలు పంచుకునే అదృష్టం నాకెక్కడా !

ఒంటరిగా దిగులతో నిరాశతో కృంగిపోతూ

"పెనుచీకటాయె లోకం.

చెలరేగే నాలో శోకం."

అనే పాట మీద పరిశ్రమా పరిశోధనా సలుపుతున్న విషమఘడియలలో ఏదో ఒక ఆశాకిరణం మెరుపులా మెరిసింది. ఒక తియ్యటి కంఠం 'రామం' అని నన్ను పిలిచింది. కళ్ళు నమ్మలేదు. చెవులు వినలేదు.

'రామం' అని తరుణి ఒకతె నన్ను పలుకరించింది.

'శ్యాం'

'నాన్న ఓడిపోయాడు రామం' అంటూ అంటూ ఆ చిన్నది తన చేతిని నా భుజం మీద ఉంచి, 'ఇల్లా అయిపోయావేం రామం'

'శ్యాం ! నిజంగా వచ్చావా'

నిజంగానే వచ్చాను రామం, నాన్న జరిగినదంతా చెప్పాడు.

అప్పుడేం జరిగింది.

పెద్ద యుద్ధం జరిగింది.

అమ్మ ఎవరి పక్షం

మన పక్షమే

మరి మీ నాన్న స్నేహితుడి కొడుకు ?

నేను చెప్పింది కాదంటే, శ్యామల ప్రాణంతో దక్కదని....

అంతమాట వద్దు శ్యాం

నాన్న ఒక షరతు పెట్టాడు రామం

ఏమిటది ?

సమాధానం చెప్పటానికి శ్యామల మొదట్లో సిగ్గుపడింది. తరువాత మెల్లగా 'నీ పరీక్షలు అయిన తరువాతనే నువ్వు మాకు బంధువువి అయ్యేది.' అని అంది.

అంతవరకూ.....

అంతవరకూ శని ఆదివారాలలో మా యింటి దగ్గర కలుసుకోవచ్చు.

మీ నాన్నగారు...

నాన్నగారికి నువ్వంటే చాలా యిష్టం

'థ్యాంక్యూ'

'వస్తాను రామం, సాయంకాలం వస్తావు కదూ' అంటూ శ్యామల అక్కడ నుంచి కదలిపోయింది. నేను కన్యాశుల్కంలో చివరి దృశ్యం గుర్తుకు తెచ్చుకొని సౌజన్యరావు ఎదుట నిబడ్డ మధురవాణి భంగిమలో

'ఒక ముద్దుకు కరువా' అని అన్నాను.

శ్యామలముఖం కెంపు వన్నె కొచ్చింది. కోపంతో మాత్రం కాదు. నాకు రవ్వంత దగ్గరగా వచ్చి ముక్కు మీద వేలు వేసుకుని.

'తప్పు తప్పు' అని నా బుగ్గమీద చిటుక వేసి, అక్కడ నుంచి తన స్నేహితురాలి యింటికి తరలిపోయింది.

తను ఆనందం పట్టలేక తబ్బిబ్బై 'యాహూ!' అంటూ 'జంగ్లీకేక పెట్టి' చాహె మరెుకోయి జంగ్లీ కహె' అంటూ బిగ్గరగా పాడటం మొదలు పెట్టాను. పాడుతూ పాట మధ్యలో ఆపి కిటికీ వంక చూశాను.

ప్రక్క భాగంలో అద్దెకుంటున్న అయ్యంగారి కుటుంబమంతా కిటికీలోంచి చూస్తోంది.

అయ్యంగారి భార్య మంగతాయరమ్మ గారు 'ఇందాకటి దాకా బాగానే

వున్నాడమ్మా, ఇంతలోనే మాయదారి జబ్బు ఎల్లా ముంచుకు వచ్చింది. ఎల్లా వుండే వాడు ఎల్లా అయిపోయడమ్మా' అన్నట్టు నా వంక జాలిగా చూస్తోంది.

నేను పాట ఆపి ఒక్క క్షణం వాళ్ళవంక నిశ్శబ్దంగా చూశాను. వాళ్ళు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాని యీ అంతులేని ఆనంద తరంగాలని ఎల్లా అణచను, ఈ ఆనందం వరపలకి ఆనకట్ట ఎక్కడ ? కట్టేదెవరు ? కట్టించుకునే దెవరు ? అవధిలేని ఆనందంలో తన్మయుడనవుతూ మళ్ళీ మంచానికి అడ్డంగా పడుకొని

'యాహు !' అంటూ మళ్ళీ రంకెపెట్టాను.

ఈ సారి అయ్యంగారే స్వయంగా కిటికీ దగ్గరకు వచ్చి "ఎన్న తంబీ ! ఒళులు సరియిల్లియా ?" (ఏం తమ్ముడూ వంట్లో బాగుండలేదా ?) అని అడిగాడు.

కాని యీ ఆనందం శాశ్వతం కాలేదు. మార్చి రెండవ వారంలో శ్యామలావాళ్ళ పరీక్షలు అయిపోయాయి. వాళ్ళ కుటుబంమంతా బెంగుళూరు వెళ్ళిపోయారు. వెడుతూ నా ఆనందం ఉత్సాహం అంతా మూటగట్టుకుని తీసుకుపోయారు. వియోగం విరహం భరించలేక నేను నా జీవితంలో ప్రణయలేఖ రాశాను. అది నేను నా జీవితంలో రాసిన తొలి ప్రణయలేఖ. శ్యామలకు వచ్చిన తొలి ప్రణయలేఖ కూడా అదే.

శ్యాం

పున్నమినాటి రేయి, వెన్నెలహాయి చూసి, ఈ ఆనందం, యీ తన్మయత ఎప్పుడూ యిల్లాగే వుండాలని కోరుకుంటె ఏం జరుగుతుందో మన విషయంలో కూడా అదే జరిగింది. పున్నమి వెళ్ళిపోయింది. వెన్నెల మాయమైంది. రేయి గడిచి పగలు వచ్చి తన కర్కశ కాంతులతో మరిచిపోదామనుకున్న నగ్న సత్యాన్ని మరువనియ్యకుండా చేసింది. ఎటు - చూసినా ఆనందం, అద్వైతం 'పువ్వు నవ్వింది, పున్నమి నవ్వుతోంది. కాని నీవు లేక నేనున్నాను.' కారణం నా నవ్వులో చిరునవ్వు కలపగల చిన్నారి ఎన్నో యోజనాల దూరమైంది. నీ దరిచేరాలని నీతో మనస్సు విప్పి ఎన్నో మాటలు చెప్పాలని నిన్ను చూస్తూ నన్నునేను మరిచిపోవాలని యీ హృదయం అనుక్షణం కాంక్షిస్తోంది. దూరంగా వుండి కసి తీర్చుకుంటావో. దరిజేరి కరుణ చూపుతావో ఏమిటో నీ నిర్ణయం అని ఎదురుచూసే

సీరామం

కొన్ని యుగాల అనంతరం మనసైన చెలి మనస్సు విప్పి తన మనస్సులోని మాటలు చెప్పింది.

రాం

నీ దగ్గర నుంచి ఉత్తరం వస్తుందని ప్రతిరోజు ఎదురు చూసాను రామం. రోజూ నిరాశే వచ్చేది. మనుష్యులు దూరమంగానే, మమతలుకూడా దూరమై య్యామేమోనని భయపడ్డాను. నీ శ్యామలని మరిచిపోయావేమోనని అనుక్షణం హడిలిపోయేదాన్ని కాని మా రామం మాత్రం అందరిలాంటి వాడు కాదు అన్న నమ్మకం మాత్రం పోలేదు. ఏ నాటికీ నీ దగ్గర నుంచి ఉత్తరం రాకపోతే రామం కూడా అందరిలాంటి వాడి నేమో అని అనుమానం వేసింది. ఆలశ్యంవల్ల నిరాశగా మారకముందే నీ ఉత్తరం వచ్చింది. నీ ఉత్తరం చూసి, అమ్మ చాలా సంతోషించింది. నీ ఉత్తరం చదివాను. ఆనందం పట్టలేక, పాట పాడుతూ తోటలోకి వెళ్లాను.

"నీ కథ నాకు తెలుసోయి"

అందాల నెల బాలుడా అని నేను మిట్ట మధ్యాహ్నం పాడుతూ వుంటే చూసి మా నాన్న అమ్మతో.

'అమ్మడు అల్లా పాడుతోందేం... అని అడిగాడు. అమ్మ నాకంటె చిన్నదై'

'ఎందుకో మీకు తెలియనట్టు' అంటూ చిరునవ్వు నవ్వింది. నేను యింట్లోకి వస్తుంటేనాన్ననన్ను పిలిచి

'ఆ కథ ఏమిటో నాకూ చెప్పమ్మా' అని అన్నారు. ఎల్లా చెప్పను రామం ! ఏమని చెప్పను రామం, కబీరు చెప్పినట్టు యీ ఆనందం, మూగవాడు తిన్న పటికబెల్లం లాంటిది. దాని రుచి వాడు ఎల్లా వర్ణించగలడు? ఆ ఆనందం అనుభవించి తీరవలసిందే దానికి ఏ భాషలో కూడా మాటలు లేవు.

రామం ! రామం! నేను నిన్ను శివధనస్సు ఎక్కు పెట్టమనటం లేదు మత్స్యయంత్రం కొట్టమనటం లేదు నీ పరీక్షలు అయ్యేదాకా కథలు రాయటం, సినిమా పాటలు పాడటం మానేయి నీకు యూనివర్శిటీ ఫస్టు రావాలి. నాకోసం ప్లీజ్.

వెంటనే సమాధానం రాస్తావు కదు ! ఆలస్యం భరించలేను రామం. వెంటనే ఉత్తరం రాకపోతే అనుక్షణం అలజడి పడుతుంది నా హృదయం. వెంటనే ఉత్తరం రాయి. రాస్తావు కదూ.

నీ శ్యామల

శనివారం యింకా నాలుగురోజులు. రాత్రి బెంగుళూరు మెయిల్లో వెడితే ఉదయానికల్లా బెంగుళూరు చేరవచ్చు. అక్కడ రాత్రి బండి ఎక్కితే, ప్రొద్దుటికల్లా మదరాసు తిరిగి రావచ్చు. ఒకసారి వెళ్లివస్తే ఏం ? నాశ్యామలని చూసి రావచ్చు. మనసులోని రెండు మాటలు చెప్పి రావచ్చు. కాని పిలవని పేరంటం. కాబోయే అత్తవారింటికి వెడితే చులకన అవుతానేమో? వాళ్ళ దృష్టికి చులకన ఆననేమో,

అత్తగారు పిల్లినో కుక్కనో అన్నట్టు 'ఇంత ఆగలేని మనిషిని ఎక్కడ చూడలేదమ్మా పెళ్ళి కాకుండానే యిల్లా కొంగుపట్టుకు తిరిగితే పెళ్ళయినతరువాత ఇహ ఏం చెప్పాలి ? అందుకనే వివాహం విద్యనాశాయా.... సర్వ నాశాయ.... ఐనా నా కెందుకమ్మా ఒసేయికన్నియమ్మా ఇల్లు పూడ్చే' అంటూపరోక్షంగా' ఉపన్యాసం ప్రారంభించిందంటే మనం మదరాసుపోయే బండీ వచ్చేదాక వెయిటింగు రూమ్‌లో గడపాలి.

అక్కడ కన్నీరు మున్నీరయ్యే ప్రియురాలు, ఇక్కడ అర్థంకాని ఆవేదనతో తపనపడే మనం.

'ఎందుకొచ్చిన బెడదయిది వారి ఆహ్వానం మీదనే అక్కడికి వెడదాం.' అని మనస్సు సలహా యిస్తే, హృదయం మాత్రం.

రామం! ఇదేనా నీ ప్రేమ ? ప్రేమిస్తున్నానని ఇంగ్లీషులో కూడా చెప్పావే.

చిన్నది చామంతి రేకుల వన్నెది

మొన్ననే అటు మొన్ననే

మోజై రమ్మన్నది రా అన్నా !

సిరిసిరి మువ్వా గువ్వల చెన్నా !

అన్న రామకృష్ణయ్యగారి పాటలోలాగా చిన్నది నీకై తపించిపోతూంటె మీనమేషాలు లెక్కపెడతావా, ఇంత చిన్న విషయానికి ఇన్ని ఆలోచనలు చేస్తావా అని నన్ను అవమానం చేసేసరికి, నాకు కోపం వచ్చింది. ఒక్కక్షణం ముఖం కందగడ్డ అయింది. వెంటనే 'థియరీ ఆఫ్ రెలిటివిటీ' పుస్తకం మూసేసి, అయ్యంగారి అబ్బాయిని అడిగి, 'బాటిల్ భాయి అడ్వాన్సుడు ఎక్కౌంట్సు పుస్తకం తీసుకువచ్చి బ్యాలెన్సు షీటు అధ్యాయం చదవటం మొదలు పెట్టాను. చదువుసాగనివ్వకుండా. మధ్యలో హృదయం "ప్రియురాలు పిలుస్తోంది రామం. ప్రియురాలు పిలుస్తూవుంటె అకౌంటు పుస్తకం చదువుతావా ?అని మందలింపుగా హెచ్చరించ పోయేసరికి.

'ఛస్ ! ఇదెక్కడి శల్యసారధ్యం' అని కోపం తెచ్చుకుని

'మిష్టర్ హృదయం' అని కోపంగా హృదయాన్ని పిలిచాను.

'ఎస్ ప్లీజ్' అని హృదయం ఎంతో నమ్రతగా పలికింది.

యూ ప్లీజ్ షటప్. నన్ను డిస్టర్బ్ చేయవద్దు. చాలా సీరియస్ పనిలో వున్నాను. అని గర్జించాను.

'ఎస్ ప్లీజ్' అని హృదయం పలికింది.

మొదలు పెట్టాను. యుగ యుగాలు గడిచి ఎట్టకేలకు శుక్రవారం వచ్చింది.

చి॥ రామానికి

నీ ఉత్తరం అందింది. పరీక్షలు వస్తున్నట్టున్నాయి. బాగా చదువు. నువ్వు ఎప్పుడు రావడానికి వీలు అయ్యేది నేను రాస్తాను. కొద్ది రోజుల్లో మళ్ళీ రాస్తాను. అప్పుడు తప్పక రావలసింది. ఇల్లా రాశానని అవ్యధాభావించవద్దు. అమ్మాయి వాళ్ళ అమ్మ కులాసాగా వున్నారు.

ఇట్లు,
వీరభద్రం

ఉత్తరం చదివి నేను బిగ్గరగా నిట్టూర్పువిడిచాను.

'నీ బ్యాలెన్సు షీటు ఏమైంది' అని హృదయం అడిగింది.

'షటప్' అని బిగ్గరగా అరిచాను.

'నాటకం రిహార్సులు చేస్తున్నావా మామా !' అని ఇందిర తమ్ముడు అన్నాడు. నేను మాట్లాడకుండా ఇలస్ట్రేటెడు వీక్లీ యివ్వబోయాను. వాడు తీసుకోకుండా.

'అక్క చదవటం మానేసింది' అని అన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. పరీక్షలు రోజుల్లోకి వచ్చాయి. మంచి పట్టుదలగా చదువు సాగిపోతోంది. ఒక గురువారం ఉదయం నాన్న దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

చి॥ రామానికి,

ఆశీర్వచనములు, పరీక్షలు వస్తున్నాయి. బాగా చదువుతున్నావని తలుస్తాను. నీకు క్లాసు వస్తే మా దాంట్లోనే జ్యూనియరు ఆఫీసరుగా డైరెక్టుగా అపాయింటు చేస్తామని మా డైరక్టర్లు నాతో చెప్పారు. నాలుగు వందలు-ఎనిమిది వందల గ్రేడు, రెండు సంవత్సరాలు కష్టపడితే ఫారిన్ తప్పక పంపిస్తారు.

ఇంకొక్క విషయం మేము పెద్దవాళ్ళమైపోతున్నాం. నీకు పరీక్షలు కాగానే పెళ్ళి చెయ్యాలని, కొడుకూ కోడలు యింట్లో తిరుగుతూ వుంటే, చూడాలని నేనూ మీ అమ్మ ఉబలాటం పడుతున్నాం ఈ సందర్భంలో రామం. నిన్ను ఒక విషయ ప్రార్థించవలసి వస్తోంది. పిల్లల వివాహాల విషయాలలో వాళ్ళకి పూర్తి స్వాతంత్ర్యం, యివ్వాలనే వాళ్ళల్లో మొదటి వాడిని నేను, వాళ్ళ కోరికలకి అడ్డు తగలాలనే వాడిని కాను.

నువ్వు పుట్టక పూర్వం నేను బిలాస్ పూర్‌లో పనిచేసేవాడిని. అప్పుడు నాతో వీరభద్రరావు అని ఒక యింజనీయరు పనిచేసే వాడు. కొద్ది రోజుల్లో మేము ప్రాణస్నేహితులమైయ్యాము, స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలని యిద్దరం

ఎంతో అనుకునే వాళ్ళం. ఉద్యోగ ధర్మంలో మనుష్యులం దూరం కావలసి వచ్చింది. ఈనాటి వరకూ కలుసుకోలేకపోయాం. కాని మా స్నేహం మాత్రం దూరం కాలేదు. ఇన్నాళ్ళకు మా ఆశలు నెరవేరే రోజు వచ్చింది. తన కుమార్తెను నీకు యిచ్చి వివాహం చెయ్యాలని వీరభద్రరావు నాకు ఉత్తరం రాశాడు. మనల్ని వచ్చి బెంగుళూరులో పిల్లని చూడమన్నాడు. పిల్ల బి.యస్.సీ. చదువుతోందిట. సంగీతం వచ్చుట రేపు శ్రావణమాసానికి పద్దెనిమిది నిండుతాయట జాతకాలు కూడా అన్ని విధాలా సరిపోయాయి. ఆ పిల్ల కాలు పెట్టిన చోట సిరీ సంపదా అన్నీ వుంటాయి.

ఇప్పటికే నీ మనస్సులో ఎవరి మీదనైనా ఉద్దేశ్యం లేకపోతే, ఈ సంబంధం ఒప్పుకోమని నా ప్రార్థన, నీకు ఏమైనా అభ్యంతరం ఉంటే, మనస్సు విప్పి నాతో చెప్పు, నీ కోరిక ప్రకారమే జరిపిస్తాను.

ఆరోగ్యం జాగ్రత్త. డబ్బు కావాలంటే వెంటనే పంపిస్తాను. రాత్రిపూట పడుకోబోయే ముందర వేడివేడి పాలు త్రాగమని చెప్పమని మీ అమ్మ రాయమంది. ఆలోచించి సమాధానం రాయి.

ఇట్లు

కృష్ణమూర్తి

నాన్న ఉత్తరం చదవటం పూర్తిచేసి, ఒక్కసారి తలఎత్తి ఎదురుగోడవంక చూశాను. తిరుమలమందిర సుందరులు, నాకు కనిపించారు.

'ఎందుకు స్వామి నన్ను చూస్తే యింత దయ ?' అని ఆయన్ని అడిగాను. ఆయన మన మాటలతో సమాధానం చెప్పలేదు. కాని ఆయన చూపు నిలబడ్డ భంగిమా మాత్రం.

'నన్ను నమ్మిన వాళ్లకి కలియుగంలోనైనా సరే, యీ సంసార సాగరం, మోకాలు లోతే' అన్నట్టు అనిపించాయి. అందుకనే కాబోలు 'కలౌ వేంకట నాయకః అని అన్నారు.

'నమస్కారం పెట్టవేం ? అని మనస్సు గర్జించింది.'

'ఉత్త నాస్తికుడి వైపోతున్నావు రామం' అని హృదయం తనలో తను సణుక్కున్నది.

కారణం తెలియదు కాని, స్వామివారి విగ్రహం మనస్సులో మసలినప్పుడల్లా, బాధలన్నీ మబ్బు తెరలుగా విడిపోతాయి మనస్సుమబ్బుల్లో తేలిపోతుంది. నేను స్వామివారిని మనసా స్మరించి, వారి పటం ముందు సాష్టాంగ పడ్డాను.

'పడిపోయావేం మామా ?' అని ఎవరో అడుగుతున్నారు. నేను మాట్లాడలేదు.

ఈ వాలకం చూసి ఆ కుర్రకుంక బెంబేలు పడి.

'అమ్మా ! మామ.... అంటూ యిక్కడ నుంచే వాళ్ళ యింట్లోకి ఏదో చెప్పబోతున్నాడు. నేను నేల మీద నుంచి లేస్తూ.

'అరవమోక వూరుకో' అని వాడిని మందలించి కాగితం కలం తీసుకుని నాన్నకి ఉత్తరం రాయటం మొదలు పెట్టాను.

బ్రు॥వే॥ నాన్నగారికి

నమస్కారములు మీ ఉత్తరం అందినది. నేను బాగా చదువుతున్నాను. క్లాసు వస్తుందని అంతా అంటున్నారు. రాత్రి పూట రెండు అరటి పళ్ళు తిని పాలు త్రాగుతున్నాను. డబ్బు ప్రస్తుతం అవసరంలేదు. మీ వీలునిపట్టి పంపించవచ్చు.

మీ అందరి యిష్టప్రకారమే నడవాలని, మీరుచెప్పినట్టే చెయ్యాలని నా ఉద్దేశ్యం, వివాహానికి ముందు పెళ్ళిచూపులకి వెళ్లాలన్న పట్టింపులు కూడా నాకు లేవు. మీకు ఎల్లా వీలైన పక్షంలో అల్లా చేయ ప్రార్ధన అమ్మకు నమస్కారము

చిత్తగించవలెను

మీ రామం

శనివారం ఉదయం మెయిల్లో అమ్మా నాన్న వచ్చారు. వాళ్ళని చూడగానే ఇందిరా వాళ్ళ నాన్న వచ్చి పలుకరించాడు. ఉన్నన్నాళ్ళు మేమంతా వాళ్ల యింట్లోనేవుండాలని బలవంతం చేశాడు. అమ్మా వాళ్ళు వచ్చిన పని చెప్పగానే, ఇందిరా వాళ్ళఅమ్మ నా వంక అప్యాయంగా చూసి,

'తంబి రొంబ నల్లవాడు దా' అని నన్ను మెచ్చుకుంది.

అమ్మ ఏం మాట్లాడలేదు నాగదిలోకి వచ్చిన తరువాత నాన్నతో

'ఆవిడ ఏం మనిషంట ? బంగారంలాంటి మన రామం నల్లగా వుంటాడంటుందేమిటి? మా వాడు తన పిల్లల కంటే, ఛాయ ఎక్కువే.' అని అంది. అప్పుడు నేను పరిస్థితి విషమిస్తుందని గ్రహించి,

'అమ్మా అరవంలో, నల్ల అంటే మంచి అని అర్ధం.'

'నల్ల అంటె మంచైతే ఎర్ర అంటే చెడు అని అర్ధమా !'

'కాదమ్మా, ఆ భాష తీరే అంత.'

'ఒరేయి మన రాత్రి బండిలో బయలుదేరి వస్తున్నామని వైర్ యిచ్చాను. సిద్ధంగా వుండు. నేను అల్లా వూళ్ళోకి వెళ్ళి వస్తాను.' అని నాన్న అన్నారు.

సాయంకాలమైంది. నేను చదువుకుందామని పై డాబా మీదకు వెళ్ళాను.

చీకటి పడుతోంది. డాబా మీద దీపం యింకా వెలిగించలేదు.

'మామా!' అని ఇందిర పిలిచింది.

'ఏం ఇందిరా ! ప్రొద్దుటి నుంచి కనిపించలేదేం'

నువ్వు ఇటువంటి వాడివనుకోలేదు. ఇల్లా ప్రవర్తిస్తావనుకోలేదు.

'ఏం చేశాను ?'

ఒక పిల్లతో ప్రేమించానని కల్లబొల్లి మాటలు చెప్పి, నమ్మించి, యిప్పుడు యిల్లా ద్రోహం చేస్తావా,

ద్రోహమా ?

ద్రోహము కాకపోతే ఏమిటిది ? మనసిచ్చిన వాళ్ళకి ద్రోహం చేస్తావా ?

నవ్వు అనేదేమిటి ?

నేనదేమిటో నీకు తెలుసు, శ్యామల నాతో అంతా చెప్పింది.

ఏమని చెప్పింది ?

మీరు యిద్దరూ ప్రేమించుకున్నారని, పెళ్ళి చేసుకోబోతున్నారని ఇప్పుడు చేసుకోనని అనుమానం వేసిందా ? నేను ద్రోహం చేసేవాడిలాగా కనిపించానా?

నువ్వు ఎంతో మంచివాడివి మామా ! అందుకనే నమ్మలేకపోతున్నాను. ఒక పిల్లకి మనసిచ్చి ఇంకోక పిల్లని చూడటానికి వెడతావా తప్పు కాదా !

పిచ్చిదానా ! ఇప్పుడు మేము శ్యామలా వాళ్ళ యింటికి వెడుతున్నాం.

నిజమా మామా! నా మీద ఒట్టేనా ?

నిజం ఇందిరా. భగవత్సాక్షి.

'నువ్వు దైవంలాంటివాడివి మామా పొరబాటుగా మాట్లాడాను.' నన్ను మన్నించు మామ.

అదేమీ అంత తేలిక కాదులే రేపునీకు కొడుకు పట్టితే. వాడికి నా పేరుపెట్టు అప్పుడు మన్నిస్తాను

'ఫో ! మామా!' అంటూ దొంగకోపంతో కొర కొరా చూస్తూ అంతలోనే చిరునవ్వు నవ్వుతూ అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

'రామం !' అని అమ్మ పిలిచింది.

నేను ఉలిక్కిపడి ఎగిరి గంతువేసినంత పనిచేశాను.

'ఎవరు !'

'నేనురా! ఏమిటి ఆ అమ్మాయితో మాట్లాడుతున్నావు'

'అదా ! వాళ్ళాయిన యింకా యింటికి రాలేదట. ఆఫీసుకి ఫోను చేసి కనుక్కో మంటుంది.

'ఇప్పుడేగా ప్రొద్దుగూకింది. వస్తాడు రాకేం చేస్తాడు ? మగవాడన్న తరువా లక్ష పనులుంటాయి. ఇరవై నాలుగు గంటలు పెళ్లాం ఎదురుగుండా కూర్చుంటే మాత్రం ఏం బాగుటుంది ?''

నేనేం సమాధానం చెప్పలేదు. ఇంతలోనే డాబా మీద లైటు వెలిగింది. నేను పుస్తకం తీసుకుని బిగ్గరగా చదవటం మొదలుపెట్టాను. అమ్మ ఒక ఐదు నిముషాలు నా దగ్గర కూర్చొని క్రిందకి వెళ్లిపోయింది.

ఆదివారం రాత్రి బయలుదేరి సోమవారం ఉదయం బెంగుళూరు చేరాము. స్టేషనకు శ్యామలా వాళ్ళ నాన్నగారు వచ్చారు. నాన్నని చూడగానే కౌగలించుకొని

'నువ్వు ఉత్త దొంగ రాస్కెలు అయిపోయ్యావురా' అని అన్నారు.

నాన్నకూడా నవ్వుతూ నీ కంటె ఎక్కువ కాదులే అని అన్నారు.'

నా వంక చూసి వీరభద్రరావుగారు - వీడేనా. మన రామం. ఎంత వాడివయ్యావురా. అంటూ నాకు కన్ను గీటాడు. నేను. నమస్కారమండి. అని అన్నాను.

అంతా కలిసిహోటలుకు వెళ్ళాము.

'ఏమయ్యోయి ! తంబూలాలు పుచ్చుకునే దాకా మీ బస యిక్కడే'

'పిసిని కొట్టుతనం యింకా పోలేదురా వీరభద్రం'

అది కాదయ్యా కతికితే అతకదంటారు. అందుకని ఆ లాంఛనం పూర్తి అయ్యేదాకా, మీకు విడిది ఏర్పాటు చేయ్యవలసిందని మీ చెల్లెలి హుకం.

ఆడవాళ్ళ సలహా లేనిది నువ్వే పని చెయ్యవని నాకు తెలుసులే

'ఒరేయ్ కృష్ణమూర్తి నీ సంగతి మాత్రం నాకు తెలియదనుకున్నావా ? అక్కయ్యతో చెప్పింది. ఇంట్లోంచి అడుగు బయట పెట్టవుగా

'చెప్పకుండా అడుగు బయట పెడితే, మళ్ళీ యింటికి రాగానే తలుపు తియ్యొద్దు?'

'అబ్బో నన్ను చూసి మహాభయపడిపోతున్నట్టు' అని అమ్మ అన్నది.

'పది గంటల తరువాత బాగుందని అన్నారు. ఈ లోపల స్నానాలు ముగించుకుని ఫలహారం చేసి బయలుదేరుదాం' అని వీరభద్రరావుగారు అన్నారు.

తొమ్మిది గంటలకి బయలుదేరి శ్యామలా వాళ్ళ యింటికి వెళ్ళాం. శ్యామలా వాళ్ళ అమ్మగారు, ఎంతో అప్యాయంగా మాట్లాడారు. మేమంతా సావిట్లోకి వెళ్ళి కూర్చున్నాం, కుశల ప్రశ్నలైన తరువాత.

'అమ్మాయిని తీసుకుని రా' అని వీరభద్రరావుగారు అన్నారు.'

లోపల నుంచి శ్యామల వచ్చింది. ఆ మనిషిని చూస్తూ ఎల్లకాలం వుందామనిపించింది. శ్యామల యింత అందగత్తె అని యీ నాటి వరకూ నాకు తెలియదు.

నాన్న ముఖంలో ఎంతో ఆనందం కనిపించింది. అమ్మ ముఖంలో ఆశ్చర్యం కోపం చిరాకు అన్నీ కనిపించాయి.

మస్టర్డ్ కలరు చీరమీద బంగారపు జరీగళ్ళు, ఆకుపచ్చ రంగు నెమళ్ళ బార్డరు ముఖాన పావలా కాసంత బొట్టు, కళ్ళకు కాటుక, నడుంకి వడ్డాణం, మెళ్ళొ రెండు వరసల బంగారు రుద్రాక్షమాల, 'ఐ యాం సారీ గుళ్ల పేరు.

మా నాన్న గారికి అమ్మకు నమస్కరించింది. నా వంక దొంగచూపు చూసి అతిసిగ్గుతో తలవంచుకుని బుద్ధిమంతురాలూగా కూర్చుంది.

నాకు నిజంగానే ఎవరో క్రొత్త పెళ్ళి కూతురుని చూస్తున్నట్లు అనిపించింది.

'పేరేమిటి ?' అని అమ్మ అడిగింది.

'శ్యామల'

'ఇల్లా వచ్చి నా దగ్గరగా కూర్చో అత్తయ్య దగ్గర సిగ్గుదేనికి' అంటూ అమ్మ అన్నది. శ్యాల లేచి మెల్లిగా నడచివచ్చి అమ్మ దగ్గర కూర్చుంది. బస్సుకోసం పరుగెత్తుకుంటూ వస్తున్నట్టు వచ్చే నడకకి యీ నడకకి ఎంత తేడా వుంది. అది గాలి కెగిరి పోయే పక్షి. ఇది మబ్బులో తేలిపోయే హంస. విశాలగగనంలో అది నిత్యం కనిపిస్తుంది.

'నువ్వు చాలా బాగా పాడతావని మీనాన్న చెప్పాడు. ఒక్క మంచి పాట పాడు విందాం.'

తలవంచుకుని కూర్చున్న శ్యామల తలఎత్తి పాటకచేరీ చేసే స్టయిల్లో కూర్చొంది. ఇప్పుడు ఇక ఏ త్యాగరాజకృతో పాడి నా ప్రాణం తీస్తుందని దిగులుగా కూర్చున్నాను.

నిదుర బరువులు నన్ను విడుచుటేవాడు నీవు నా మ్రోలనే నిలుచుటే నాడో' అంటూ శ్యామల పాడటం మొదలుపెట్టింది. ఈ పాట అనేకసార్లు అనేకమంది పాడగా విన్నాను. అందరికంటే యీ పాట నేను బాగా పాడుతానని యింతకాలం

కంఠం.

'బ్యూటిఫుల్' అని అన్నది.

పెద్దవాళ్ళంతా ఫక్కున నవ్వారు. శ్యామలని దగ్గరకు తీసుకుంటూ మా అమ్మ.

'ఇంతకూ మావాడు నీకు నచ్చాడుటే అని అడిగే సరికి శ్యామల ముసిముసి నవ్వుతో ముఖం రెండు చేతుల్లో దాచుకుంది. ఆదృశ్యం చూడగానే, అమ్మ ముఖం విప్పారింది. వీరభద్రరావుగారు ఎవరికో ఫోను చేశారు. కొంచెం సేపట్లో సిద్ధాంతి వచ్చాడు. ఆయన సమక్షంలో కృష్ణమూర్తిగారి కుమారుడికి, వీరభద్రరావుగారి కుమార్తెకు నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నారు.

వీరభద్రరావుగారూ వాళ్ళు మా అమ్మకు నాన్నకు బట్టలు పెట్టారు. నాన్న అంతకు పూర్వమే మదరాసు నల్లిచినస్వామి షాపులో కొన్న పట్టుచీర, రవికల గుడ్డ పళ్లెంలో పెట్టించి. ఇప్పించబోతున్న సమయంలో అమ్మ నేను ఊహించనటువంటి పని ఒకటి చేసింది. తను ఎంతో మోజుపడి, నాన్నని ఎంతో వేధించి, చేయుంచుకుని యింతకాలం పెట్టెలో పెట్టి దాచిన రాళ్ల గాజులు శ్యామల చేతులకి తొడిగింది.

శ్యామల మా అమ్మకు, నాన్నకు నమస్కరించింది. నేనూ వాళ్ళమ్మకూ నాన్నకూ నమస్కరించారు.

అనంతరం షడ్రసోపేతంగా విందారగించిం. ఇంత ఆనందంలో కూడా నాకు ఏదో వెలితి గోచరిస్తూనే వుంది. మదరాసు నుంచి వచ్చాను. శ్యామలని చూశాను. వాళ్ళు చేసిన రాజ మర్యాదలు పొందాను కాని శ్యామలతో రెండు క్షణాలు ఒంటరిగా వుండటానికి కాని, మనసువిప్పి ఒక్కమాట మాట్లాడడానికి కాని, అవకాశం లేకపోయింది.

ఈ మర్యాదలన్నీ ఒక ఎత్తు, శ్యామలతో మాట్లాడటం ఒక ఎత్తు, ఎప్పుడు, చూసినా ఎవరో ఒకరు ఆ పిల్లని అంటిపెట్టుకుని వుంటె పలకరించటం మెల్లా ?

సాయంకాలమైంది. మేము బయలుదేరేవేళ అయింది. నా మనస్సు యిహ వుండబట్టలేదు. టైపిన్ను తీసి జేబులో వేసుకున్నా, టై కట్టుకుని టై పిన్ను కోసం రెండు క్షణాలు వెతికినట్టు నటించి,

'సావిట్లో బల్లమీద పెట్టానేమో' అని అంటూ లోపలికి వెళ్లాను.

శ్యామల తలుపు ప్రక్కన నుంచొని దొంగచాటుగా చూస్తోంది. నేను లోపలికి రావటం చూసి రవ్వంత ఖంగారు పడ్డది.

'సారీ ! ఇక్కడ బల్లమీద టైపిన్ను మరిచినట్టున్నాను' అని అన్నాను.

నిజమనుకుని తను కూడా వెతకబోయింది.

'ఉత్తరం రాయలేదని కోపం వద్దు శ్యాం' అని మెల్లగా అన్నాను.

'నువ్వే వచ్చావుగా అంతకంటె యింకా ఏం కావాలి ! బాగా చదువు రాం'

నేను టైపిన్ను పెట్టుకుని బయటకు వస్తూ

గుడ్ బై శ్యాం అంటూ టకటక బయటకి వచ్చాను.

పరీక్షలు వచ్చాయి. బాగా రాశాను. పరీక్ష లైన సరీగ్గా నెల రోజులకి, అగ్నిసాక్షిగా, దైవసాక్షిగా శ్యామల మిసెస్ రామం అయింది.

పున్నమినాటి రేయి వచ్చింది. వెన్నెల దిక్కుకై నేను నిలబడి వున్నాను.

వసంత ఋతువు ఎటు చూసినా నవ్యచైతన్యం పిల్లగాలికి ప్రకృతే పరవశమొందించే శుభగడియలలో ఏదో రవళి విని నేను వెనుతిరిగి చూస్తే, భువనైక మోహిని ఎవరో నా వెనుక నిలిచింది. అజంతా ఎల్లోరాలలో సందరలను మించిన సుందరిలకంటె, సుందరి, ఎర్రబార్డరు తెల్లసిల్కుచీరె, తెల్లటి రవిక, మల్లెపువ్వుల జడ అరచేతిలో గోరంటాకు, కాళ్లకు పారాణి, నడుంకి వడ్డాణం చేతులకి అమ్మ యిచ్చిన రాళ్ళ గాజులు. మెళ్ళో రుద్రాక్షమాల.

'ఐ మీన్ గుళ్ళ పేరు.'

చిన్నది తలవంచుకుని తలుపుదగ్గర నిలబడ్డది.

నేను దగ్గరకు వెళ్ళి 'శ్యాం' అని పిలిచాను. ఆ పిలుపు విని చిన్నది తలఎత్తి నా వంక చూస్తుందని ఆశించాను. కాని ఏం మాట్లాడకుండా శ్యామల వంగి నా పాదాలకి నమస్కరించబోయింది.

'వద్దు శ్యాం' అంటూ నేను వారించబోయాను.

నాపాదాలని తాకిన చేతులని కళ్ళకు అద్దుకుంది. ఆ శ్యామల సుందర వదనాన్ని నా చేతుల్లోకి తీసుకుని కళ్ళల్లోకి చూస్తూ.

"మిసెస్ రుద్రాక్షమాల !' అని పిలిచాను.

ఊఁ

"ఒక ముద్దుకు కరువో0"

కన్నులు మూసి నాకు చేరువవుతూ ఆ చిన్నది "కొంటెవాడా !" అని అన్నది.